ప్రజాశక్తి
గురువారం 29 ఫిబ్రవరి 2024 8 పేజీలు





ప్రకాశం బాపట్ల



ఏర్పాట్లను పరిశీలిస్తున్న విజయసాయిరెడ్డి

సిద్ధం సభకు ముందే..

అన్ని సీట్లూ ప్రకటిస్తాం..

- మేదరమెట్ల వద్ద సభ 10కి మార్పు
- 15 లక్షల మందికి సరిపడా ఏర్పాట్లు
- త్వరలో మేనిఫెస్టో విడుదల
- ఎంపీ విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి-అద్దంకి, మేదరమెట్ల

మేదరమెట్ల వద్ద మార్చి మూడున నిర్వహించతలపెట్టిన సిద్ధం సభను మార్చి 10వ తేదీన నిర్వహించాలని పార్టీ నిర్ణయించినట్లు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి తెలిపారు. మేనిఫెస్టోపై కసరత్తు జరుగుతోందని, అతి త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. సిద్ధం సభకు ముందే అన్ని సీట్లు ప్రకటించనున్నట్లు తెలిపారు.

అద్దంకి నియోజకవర్గం మేదరమెట్ల, పి.గుడిపాడు జాతీయ రహదారి పక్కన సిద్ధం సభ ఏర్పాట్లను పార్టీ ముఖ్యనాయకుల తో కలసి బుధవారం ఆయన పరిశీలించారు.. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లా డుతూ మేదరమెట్ల జాతీయ రహదారి వద్ద సుమారు 98 ఎకరాల్లో సభా ప్రాంగణం సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. సభకు గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి పార్లమెంటు నియోజకవర్గాల ▶ 2లో

ఒంగోలు పార్లమెంట్ సమన్వయకర్తగా చెవిరెడ్డి 8లో ▲

దళితుల భూమి కబ్జా..!

- తనఖాలో ఉండగానే క్రయ విక్రయాలు
- కౌలు పేరు చెప్పి మోసగించారన్న దళితులు



తమ భూమి కబ్జా చేశారని చెబుతున్న దళిత రైతులు

ప్రజాశక్తి-పిసిపల్లి

దళితుల భూమి కబ్జాకు గురైంది. ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా భూమి తనఖా పెట్టి రుణాలు పొందారు. కౌలుకు పొలం ఇవ్వాలంటూ కొందరు దళారులు మాయమాటలు చెప్పి వేలిముద్రలు వేయించుకున్నారు. చివరకు భూమి తనఖాలో ఉండగానే అధికారులు కుమ్మక్కై భూములను రిజిష్టరు చేయించారు. విషయం తెలుసుకున్న రైతులు ఆందోళన చెందుతున్నారు.

మండలంలోని కోదండరామాపురం, మెట్లవారిపాలెంకు చెందిన 22 మంది పేద దళితులకు 44 ఎకరాల భూమిని పిసిపల్లి మండలంలోని గుంటూరు లింగన్నపాలెం రెవిన్యూ పరిధిలోని ప్రకాశం జిల్లా షెడ్యూల్ కులాల సహకార సంఘం వారి రుణ సహాయంతో ఎకరాకు రూ.6 వేల చొప్పున ఒక్కొక్కరికి రెండెకరాల ప్రకారం తేది:08.11.1994న కొనుగోలు చేశారు. ఈ భూమికి అదనంగా అభివృద్ధి కోసం అదే సంవత్సరం నవంబర్ 14న ఒక్కొక్కరికి ప్రకాశం జిల్లా షెడ్యూలు కులాల సేవా సహకార సంఘం లిమిటెడ్ వారు దళితులకు ఇచ్చిన భూమిని కనిగిరి సబ్‌రిస్ట్రార్ కార్యాలయం ద్వారా తనఖా పెట్టుకొని ఒక్కొక్కరికి రూ.8400 రుణాలు మంజూరు చేశారు. ఈ రుణాల మంజూరు కోసం ఎస్సీ కార్పొరేషన్ ఇడి పేరున తనఖా పెట్టి.. రుణాలు అందజేశారు. ఈ భూముల్లో ప్రభుత్వం ఆరుగురికి బావులు మంజూరు చేసి తవ్వించింది. ఆ తరువాత కొందరు దళిత దళా రులు తోడై భూ యజమానుల వద్ద భూములు కౌలుకు ఇవ్వాలని మాయమాటలు చెప్పి కొంత నగదు ముట్టచెప్పి వేలిముద్రలు వేయించు కున్నారు. దళారులు 20 సంవత్సరాలకు కౌలుకు అడుగగా వీరు మాత్రం కేవలం 14 సంవత్సరాలకు మాత్రమే కౌలుకు ఇచ్చారు. అప్పటివరకు భూమిని సాగు చేసుకుంటున్న దళిత రైతులకు వర్షాలు లేకపోవడం, భూగర్భజలాలు అడుగంటడం మినహా వ్యవసాయాన్ని వదిలేసి కూలి పనులు చేసుకుంటున్నారు. ఇదే అదునుగా భావించిన దళారులు వీరి వద్ద కౌలుకు భూములను తీసుకున్నారు. ఆ తరువాత అనుకున్న గడువు తీరిపోవడం వల్ల, ఈ మద్యలో ఎవ్వరూ భూముల వద్దకు రాకపోవడం వల్ల తాము ఎవరికి చెప్పకోవాలో అర్థం ▶ 2లో



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న దళితులు

వైసిపికి మాగుంట గుడ్‌బై..

- పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటన
- తనయుడు రాఘవరెడ్డి ఎంపీగా పోటీ చేస్తారని వెల్లడి
- త్వరలో తెలుగుదేశంలో చేరే అవకాశం



మాట్లాడుతున్న ఎంపీ మాగుంట

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

అనుకున్నదే జరిగింది. వైసిపి అధిష్టానం పాచిక పారింది. పొమ్మనకుండా పొగపెట్ట డంతో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి వైసిపితో అనివార్యంగా తెగతెంపులు చేసు కున్నారు. ఇటీవల పార్టీ అనుసరిస్తున్న వైకరితో తీవ్ర అసంతృప్తితో ఉన్న మాగుంట బుధవారం నాడు నోరువిప్పారు. తన భవిష్యత్ రాజకీయ నిర్ణయాన్ని ప్రకటించారు. ఆత్మగౌరవం లేనందున వైసిపికి రాజీనామా చేస్తున్నట్లు బుధవారం నాడు మీడియా సమావేశంలో ఎంపీ మాగుంట ఆవేదనతో వెల్లడించారు. 33 ఏళ్లుగా మాగుంట కుటుంబం గౌరవం కోసమే ఇక్కడ రాజకీయాలు చేసిందని, జిల్లా ప్రజానీకం అన్నివిధాలా తమను ఆదరించార న్నారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల రీత్యా వైసిపికి రాజీనామా చేస్తున్నట్లు కన్నీటి పర్యంత మవుతూ ప్రకటించారు. భవిష్యత్ ఏమిటనేది మళ్లీ వెల్లడిస్తామన్నారు. రాజీనామా తప్ప ఇతర విషయాలు ఏమీ మాట్లాడటానికి సముఖంగా కనిపించలేదు. త్వరలోనే అన్ని విషయాలూ చెబుతామన్నారు. తన కుమా రుడు రాఘవరెడ్డి ఎంపీగా పోటీ చేస్తారన్నారు. వాస్తవానికి ఆయన చివరి వరకూ వేచి చూశారు. ఎంపీగా తిరిగి అవకాశం కల్పిస్తారనే ఆశతోనే ఉన్నారు. కారణాలు ఏమైనా మాగుంటకు టిక్కెట్టు నిరాకరణపై వైసిపిలోనే అంతర్మథనం సాగుతోంది. మాజీ మంత్రి బాలి నేని శ్రీనివాసరెడ్డి ఇటీవల వరకూ మాగుంట కోసం పార్టీలో ప్రచ్ఛన్న యుద్ధమే చేశారు. సిఎం జగన్‌తోనే గట్టిగా పోరాడారు. సిఎం జగన్ తను తీసుకున్న నిర్ణయానికే కట్టుబడి ఉన్నందున చివరికి బాలినేని కూడా సర్దుకు న్నారు. మాగుంట వ్యవహారం వదిలేశారు. ఎమ్మెల్యే చెవిరెడ్డిని తెచ్చి జిల్లాపగ్గాలు అప్పగించారు. ఎంపీ అభ్యర్థిగా కూడా ఖరారు చేశారు. అధికారికంగా నిర్ణయించలేదు. అది జరిగాకే ఎంపీ మాగుంట బయటకు వెళ్లే నిర్ణయం తీసుకోవాలని భావించారు. అయితే కావాలనే జాప్యం చేస్తున్నారనే చర్చ కూడా ఉంది. ఒంగోలులో ఇళ్లస్థలాల పంపిణీ సభకు సిఎం జగన్ హాజరయ్యారు. ఈ సభకు ఎంపీ మాగుంటకు ఆహ్వానమే అందలేదు. కనీసం ప్రభుత్వపరం గా నిర్వహించే కార్యక్రమమైనా ప్రోటోకాల్ ప్రకారమైనా పిలవాలి. ఆ మర్యాద కూడా పాటించలేదు. సిఎం జగన్ సభకు పిలవక పోవడాన్ని తీవ్రంగా పరిగణించిన మాగుంట ఇక ఆ పార్టీలో ఉండటం అన వసరం అనే నిర్ణయానికి వచ్చారు. అంతకు ముందు పార్టీ కార్యక్రమాలకు కూడా మాగుంటకు ఆహ్వానం లేదు. ఒంగోలు పార్ల మెంటు పరిధిలోనే కోఆర్డినేటర్ చెవిరెడ్డి, మాజీ మంత్రి బాలినేని కలిసి పలుచోట్ల పర్యటిం చారు. మాగుంటను పూర్తిగా పక్కనబెట్టేశారు. దీంతో ఎట్టకేలకు పార్టీ నుంచి బయటకుపోవా లనే మాగుంట నిర్ణయం తీసుకున్నారు. రేపో మాపో తెలుగుదేశంలో చేరే అవకాశాలు న్నాయి. ఈ పాటికే చంద్రబాబుతో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీలో చేరడం లాంఛన మేనంటున్నారు. ఒంగోలు పార్లమెంటు నుంచీ ఎంపీ అభ్యర్థిగా తన కుమారుడు రాఘవరెడ్డిని బరిలోకి దింపనున్నారు. ఇక తెలుగుదేశం వర్గాల్లోనూ ఎంపీ మాగుంట వైసిపిని వీడి రావడంపై చర్చగా మారింది. మాగుంటను పోగొట్టుకోవడం పార్టీకి నష్టమనే చర్చ వైసిపి లో నడుస్తోంది. రాజీనామా చేసినట్లు ప్రకటిం చాక మాగుంట, బాలినేని.. ఇద్దరూ పట్టణం లోని ఎన్‌జీఓ భవనం ప్రారంభోత్సవంలో కలిసి పాల్గొన్నారు.

మార్కాపురంలో

3న శంఖారావం సభ

రానున్న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్

ప్రజాశక్తి-మార్కాపురం

వచ్చే నెల మార్చి మూడో తేదీన మార్కాపురం పట్టణంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆధ్వర్యంలో శంఖారావం సభ జరగనుంది. శంఖారావం సభకు సన్నాహక సమావేశం మార్కాపురం మాజీ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో మార్కాపురం పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారా యణరెడ్డి మాట్లాడుతూ నారా లోకేష్‌బాబు శంఖారావం సభను జయప్రదం చేయాలని కోరారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు మరియు వార్డుల నుండి కుటుంబ సాధికారిక సభ్యులు, బూత్ కమిటీ సభ్యులు, బూత్ ఇన్‌ఛార్జులు, యూనిట్ ఇన్‌ఛార్జులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొని దిగ్విజయం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

నేనూ టిడిపిలోకి పోవాలా.?

- మాగుంటకు ఎంపీ సీటు కోసం చాలా ప్రయత్నించా..
- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని ఆసక్తికర వ్యాఖ్యలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మాగుంట శ్రీనివాసులరెడ్డికి ఎంపీ సీటు ఇవ్వాలని చివరి వరకు ప్రయత్నించానని, ఆయన ఇప్పుడు పార్టీకి రాజీనామా చేశారని, తాను కూడా సర్దుకోకుండా టిడిపిలోకి పోవా లా.? అని ఒంగోలు ఎమ్మెల్యే ▶ 2లో



ఎన్‌జీఓ భవనాన్ని ప్రారంభిస్తున్న బాలినేని, మాగుంట

దళితుల భూమి కబ్జా.!

(మొదటిపేజీ తరువాయి)

కావడం లేదు. గత 10 రోజులుగా దళితులందరూ వారి పొలాలను ఉమ్మడిగా సాగు చేసుకుంటున్నారు. ఈ మధ్య శింగరాయకొండ ప్రాంతానికి కొందరు తమ పొలంలో జామాయిల్ చెట్లను దళితులు నరికి వేశారని కేసు పెట్టారు. తీరా పోలీసులు కేసు నమోదు చేసి దళితుల వద్దకు వెళ్ళినప్పుడు అసలు విషయం బయటకు వచ్చింది. తాము కొనుగోలు చేసిన భూములకు 1994లో భూములను తనఖా పెట్టి రుణాలు తీసుకోగా 2023లో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం దళితులకు ఇచ్చిన రుణాలను రద్దుచేసింది. రుణాలు రద్దు కావడంతో తనఖా ఉంచుకున్న ఎస్సీ కార్పోరేషన్ ఇడి రైతులందరికీ మీ భూములను మీరు స్వాధీనం చేసుకోవాలని రికార్డులను అందజేశారు. 1994లో తనఖా పెట్టిన భూమిని సర్వే నెంబర్‌తో సహా కనిగిరి సబ్ రిజిస్ట్రార్ వద్ద నుండి ఎస్సీ కార్పోరేషన్ ఇడి తనఖాను విడిపించి ఈ పత్రాలను రైతులకు అందజేశారు. రైతులు తమ భూములకు హద్దులు చూపాలంటూ పిసిపల్లి రెవిన్యూ వారిని కోరగా ఇంతలోనే మా భూములలో జామాయిల్ చెట్లు నరికారని కేసు పెట్టడం ఆశ్చర్యంగా ఉంది.

మేము భూమిని కౌలుకు ఇచ్చాం..

కనపర్తి లక్ష్మమ్మ, కోదండరామాపురం

ప్రభుత్వం ఎస్సీ కార్పోరేషన్ ద్వారా భూమి కొనుగోలు పథకం ద్వారా తమకు కొని ఇచ్చిన రెండెకరాల భూమిని 16 సంవత్సరాల పాటు సాగు చేసుకున్నారు. సకాలంలో వర్షాలు కురవక వ్యవసాయం చేయలేకపోవ డంతో కొందరు తమ వద్దకు వచ్చి భూమిని కౌలుకు ఇవ్వాల ని కోరగా అందుకు మేము కౌలు కోసం వేలిముద్రలు వేశారు. అందుకోసం కొంత నగదు ఇచ్చారు. మేము ఎవ్వరికీ భూము లు అమ్మ లేదు. కానీ ఇప్పుడు మాత్రం ఈ భూములు మావంటూ పొరుగుప్రాంతం వారు వచ్చి మాపై కేసు పెట్టడం ఆశ్చర్యంగా ఉంది.

దళారులు, అధికారులు కుమ్మక్కు

బడుగు వెంకటేశ్వర్లు,

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు

కోదండరామాపురం, మెట్లవారిపాలెంలో ప్రభుత్వం భూమి కొనుగోలు పథకం ద్వారా 22 మంది లబ్ధిదారులకు 44 ఎకరాల భూమిని కొని ఇచ్చింది. వెంటనే ఎస్సీ కార్పోరేషన్ ఈ భూమిని తనఖా పెట్టుకొని ఒక్కొక్కరికి రూ.8400 రుణం ఇచ్చింది. అయితే జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం దళిత రైతులు తీసుకున్న రుణాలను చెల్లించింది. అప్పుడు ఎస్సీ కార్పోరేషన్ ఇడి తనఖాలో ఉన్న దళిత భూములను విడిపించి వారికి సబంధిత పత్రాలను కూడా అందించారు. కానీ 2010, 2011, 2012 సంవత్సరాలలో దళితులు పొరుగు ప్రాంతాల వారకు భూములు అమ్మినట్లు, కనిగిరి రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిష్టరు చేసినట్లు రిజిష్టర్లను సృష్టించారు. తాము భూములను సాగు చేసుకుంటే దళితు తమ పొలాల్లోని జామాయిల్ చెట్లను నరికి వేశారని కేసు కూడా నమోదు చేశారు. 2023 వరకు తనఖాలో ఉన్న భూములను మద్యలో రికార్డులు ఎలా బయటకు వచ్చాయి. అధికారులు కుమ్మక్కై దళిత భూములను కాజేశారని ఆయన తెలిపారు. ఈ విధంగా దళితులకు తెలియకుండా దళిత భూములను కాజేసి దళారులు, అధికారులపై చర్యలు తీసుకోవాలని మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నేనూ టిడిపిలోకి పోవాలా.?

(మొదటిపేజీ తరువాయి)

బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. నాన్ గజిటెడ్ ఉద్యోగుల సంఘ భవనం ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే బాలినేని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిపై ఆసక్తి కర వ్యాఖ్యలు చేశారు. బాలినేని మాట్లాడుతూ ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి బుధవారం వైసిపికి రాజీనామా చేశారని, ఇటువంటి పరిణామం తనకు పెద్ద ఇదైపోయిందన్నారు. ఎన్జీవో సంఘం భవనం ప్రారంభోత్సవం సందర్భంగా ఇద్దరం పక్కపక్కన కూర్చున్నామని, ఇద్దరం వాటేసుకున్నామని అన్నారు. ఎంపీ మాగుంట రాజీనామా చేసినా ఇద్దరూ చెట్టాపట్టాలు వేసుకున్నారని, వీరిద్దరి మధ్య ఏదో జరుగుతుందని పత్రికలలో కథనాలు వస్తాయని ఈ విషయం తనకు తెలుసన్నారు. ఎన్ని జరిగినా చిత్తశుద్ధితో ఉన్నప్పుడు ఎవరెన్ని మాట్లాడినా ఒకరిని చూసి భయపడాల్సిన పనిలేదన్నారు. పార్టీలో ఉంటూ పార్టీ ద్రోహం చేసే మనస్తత్వం తనది కాదని బాలినేని స్పష్టం చేశారు.



వివాహ రిసెప్షన్‌లో వధూవరులను ఆశీర్వదిస్తున్న నాయకులు

ఘనంగా వికలాంగ జంట వివాహ రిసెప్షన్

ప్రజాశక్తి-ఒంగోలు

సూర్యశ్రీ దివ్యంగుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శివకుమార్ మహాలక్ష్మి దంపతులకు ఒంగోలు ట్రస్ట్ కార్యాలయంలో వివాహం జరిపించి వెడ్డింగ్ రిసెప్షన్ ఘనంగా నిర్వహించారు . ఎవరూ లేని అనాథులైన దివ్యాంగులు శివకుమార్, మహాలక్ష్మి హైదరాబాదులో వివాహం చేసుకున్నారు. సోషల్ మీడియా ద్వారా ట్రస్ట్ సెక్రెటరీ సర్దార్ భాష సంప్రదించి తమకు అందరు సమక్షంలో రిసెప్షన్ ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. వారి విన్నపానికి స్పందించిన ట్రస్ట్ నిర్వాహకులు సర్దార్ ప్రవాస భారతీయురాలు స్వర్ణలత కుమారుడు కట్టా అలెన్ బాబు, కార్య నిర్వాహకులుగా మండవ మురళీకృష్ణ. ఆరెన్ త్యాగరాజు, మారెళ్ళ సుబ్బారావు, నూకతోటి శరత్ బాబు, గొర్రెపాటి శ్రీనివాసరావు, షేక్ మహబూబ్ రాజేష్ . మండవలావణ్య, చేరుకూరి ఆదిలక్ష్మి, కోచూరి శ్రీదేవి,తోట్టెం పూడి సుజాత, కొమ్మి రమణయ్య రాజేశ్వరి. ఆధ్వర్యంలో నగర ప్రముఖులతో శివ కుమార్ మహాలక్ష్మి దంపతులకు రిసెప్షన్ ఘనంగా ఏర్పాటుచేశారు.

అటవీ రక్షణపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-అర్ధవీడు

అర్ధవీడులో బుధవారం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ శాఖ వారి ఆధ్వర్యంలో అర్ధవీడు, పాపినేనిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అడవి రక్షణ-వన్యప్రాణుల సంరక్షణ అనే అంశంపై వక్తృత్వ పోటీలను డివైఆర్ఓ జిబివి శ్రీనివాసులు నిర్వహించారు. ఈ పోటీలలో సుమారు వందమంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు అర్ధవీడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టీబి సత్తార్, పాపినేనిపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డివైఆర్ఓ బిజివి శ్రీనివాస్, అటవీ శాఖ సిబ్బంది ఎ మురళి, ఉపాధ్యాయులు, సహోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త దానియేలుకు నివాళి

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పి తక్కెళ్లపాడు గ్రామ తెలుగుదేశం పార్టీ కార్యకర్త సర్వేపల్లి దానియేలు(56) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మరణించారు. విషయం తెలుసుకున్న పలువురు బుధవారం ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బిఎన్ విజయ్‌కుమార్, మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, గ్రామ అధ్యక్షులు నలమోతు శ్రీనివాసరావు, నాయకులు నేతి రాజేష్, ఎన్ లక్ష్మీనారాయణ తదితరులు నివాళులర్పించారు.

సిద్ధం సభకు ముందే..

అన్ని సీట్లూ ప్రకటిస్తాం..

(మొదటిపేజీ తరువాయి)

నుంచి 15 లక్షల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. ఈ సభకు వచ్చేందుకు ఇప్పటికే 7 లక్షలకు పైగా సంసిద్ధత వ్యక్తం చేశారని అన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా పార్టీ పటిష్ట ఏర్పాట్లు చేస్తోందని, సభా ప్రాంగణం వద్ద అన్ని కనీస వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. గతంలో నిర్వహించిన భీమిలి, ఏలూరు, రాప్తాడు సిద్ధం సభలు పెద్దఎత్తున విజయవంతం అయ్యాయని, ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని, ఈ మేరకు ఎన్నికలకు మందు నిర్వహిస్తున్న చివరి సిద్ధం మహాసభ మరింత విజయవతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అందిస్తున్న సంక్షేమ పాలనతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలతో పాటు అగ్రవర్ణాలకు చెందిన పేదలు వైఎస్సార్సీపీని ఎంతగానో ఆదరిస్తున్నారని అన్నారు. గతంలో ఏ రాజకీయ పార్టీ, ప్రభుత్వం చేయని విధంగా జగన్ ప్రభుత్వం పాలన అందించిందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన, సంక్షేమ పథకాలపై ప్రజలకు, కేడర్‌కు సిద్ధం సభలో సీఎం జగన్ దిశానిర్దేశం చేస్తారని, సభ సాయంత్రం 3 గంటల నుండి 5 గంటల వరకు కొనసాగుతుందని అన్నారు. మార్చి 13, 14 తేదీల్లో ఎన్నికల ప్రకటన వచ్చే అవకాశం ఉందని, పార్టీకి ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ చూస్తే ఎన్నికల్లో 175 కి 175 సీట్లు సాధిస్తామన్న ధీమా మరింత బలపడుతుందని అన్నారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో మంత్రులు మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీలు మోపిదేవి వెంకటరమణ, నందిగం సురేష్, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశీల రఘురాం, వివిధ నియోజకవర్గ సమన్వయకర్తలు బూచేపల్లి శివప్రసాదరెడ్డి, కరణం వెంకటేష్, హనిమిరెడ్డి, ప్రకాశం జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి ఉన్నారు.

దర్జీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రాష్ట్రంలో అంతరించి పోతున్న కుల వృత్తులను కాపాడుకోవాలని, దర్జీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని దర్జీల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి (మ్యాక్స్) తెలిపారు. బుధవారం దర్జీల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ మస్తాన్‌వలి (మ్యాక్స్) మాట్లాడుతూ మారిన ఫ్యాషన్ ప్రపంచంలో దర్జీల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. రెడీమేడ్ రంగం విస్తరించడంతో టైలరింగ్‌కు గిరాకీ లేక అవస్థలు పడుతున్నారని అన్నారు. చేతివృత్తులను కాపాడుకునేందుకు ప్రభుత్వం సబ్సిడీ రుణాలు అందజేస్తే చేతి వృత్తుల వారికి చేతి నిండా పని దొరుకుతుందనివ అన్నారు. ముందుగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న టైలర్లు

ఈ కార్యక్రమంలో దర్జీల సంఘం మండల అధ్యక్షుడు షేక్ బాషా, నియోజకవర్గ అధ్యక్షుడు ఖాసింవలి, సెక్రటరీ ఇస్మాయిల్, కోశాధికారి రామయ్య, నాయకులు ఎస్‌విఆర్ వెంకటేశ్వర్లు, ఇస్మాయిల్, వలి, ఖాసిం, మండలంలోని దర్జీలు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి..

- కొండపికి అభివృద్ధిని పరిచయం చేస్తా

- మంత్రి ఆదిమూలపు సురేష్



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సురేష్

ప్రజాశక్తి-శింగరాయకొండ

వైసిపి ఒక్క అవకాశం ఇవ్వండి కొండపికి అభివద్ధిని పరిచయం చేస్తానని రాష్ట్ర మున్సిపల్ పట్టణాభివద్ధి శాఖ మంత్రి, వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండల పరిధిలోని ఊళ్లపాలెం గ్రామ పంచాయతీలో మంత్రి బుధవారం పర్యటించారు. తొలుత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా పరిషత్ హై స్కూల్‌ను సందర్శించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం రూ. 43.60 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌సెంటర్ భవనం, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ వైసిపి ఆవిర్భావం నుంచి కొండపిలో విజయం సాధించలేదని తెలిపారు. తనకు ఒక్క అవకాశం ఇచ్చి చూడాలని అభివద్ధిని కొండేపికి పరిచయం చేస్తానని పేర్కొన్నారు. గ్రామంలో కోనేరు అభివద్ధి, తాగునీటి సమస్యను త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. రామతీర్థం నుంచి వచ్చే తాగునీరు ఊళ్ల పాలెం, పాకల, బింగినపల్లి గ్రామాలకు అందటం లేదని తెలిపారు. ఆ గ్రామాలకూ రామతీర్థం నీరు తీసుకొచ్చేందుకు కషి చేస్తానని వివరించారు. మత్స్యకారులు అధికంగా ఉన్నారని, వారు మన్నేరులో వేటకు వెళితే ప్రక్క జిల్లా మత్స్యకారులు ఇబ్బంది పెడుతున్నారని, సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. సముద్ర తీరానికి వచ్చే పెద్ద బోర్డులను అడ్డుకునేందుకు ముఖ్యమంత్రి తో మాట్లాడే పెట్రోలింగ్ బోటు ఏర్పాటుకు కషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పాకనాటి అనసూయమ్మ , వైస్ ఎంపిపి సామంతుల రవికుమార్ రెడ్డి , ఉప సర్పంచి కాళహస్తి వెంకారెడ్డి, ఎంపిడిఒ నాగేష్ కుమారి, పంచాయతీరాజ్ డిఇ రవిబాబు, పంచాయతీరాజ్ ఎఇ కోటా శ్రీహరి, సచివాలయ సెక్రెటరీ సైదులు, వైసిసి నాయకులు మసనం వెంకట్రావు, చుక్కా కిరణ్ కుమార్, ముల్లపూడి సత్యనారాయణ, షేక్ కరీం, యనమల మాధవి, తంబు సుబ్బులమ్మ, రాపూరి ప్రభావతి, షేక్ పటేల్, షేక్ సలీం బాషా, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు వాలంటీర్లే వారియర్స్

మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



వాలంటీర్లకు పురస్కారాలు అందజేస్తున్న బూచేపల్లి

ప్రజాశక్తి- దర్శి

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి వాలంటీర్లే వారియర్స్ అని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే, వైసిపి దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక పిజిఎన్ కాంప్లెక్స్‌లో వాలంటీర్లకు వందనం కార్యక్రమం ఎంపిడిఒ హనుమంతరావు అధ్యక్షతన బుధవారం ఈ సందర్భంగా వాలంటీర్లకు సేవా వజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ వాలంటీర్లు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధుల్లా పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలు లబ్ధిదారుల ఇంటి వద్దకే అందిస్తున్నట్లు తెలిపారు. పింఛన్ల పంపిణీలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి వద్దకే మెరుగైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గోళ్ళపాటి సుధారాణి, వైస్ ఎంపిపి సోము దుర్గారెడ్డి, కొరివి ముసలయ్య, కమిషనర్ మహేశ్వరరావు, షేక్ కార్పొరేషన్ డైరక్టర్లు ఎస్ఎం. బాషా, సానికొమ్ము తిరుపతిరెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు కీసరి శ్రీనివాసరెడ్డి, సర్పంచి రాము, విజయ్, జెసిఎస్ కన్వీనర్లు బత్తినేని వెంకటేశ్వర్లు, కోటిరెడ్డి, కౌన్సిలర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు

కెజిబివి సిబ్బందిపై జిసిడిసి ఆగ్రహం



విచారణ నిర్వహిస్తున్న జిసిడిఒ ప్రమోద

ప్రజాశక్తి-సిఎస్‌పురం

కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో పని చేస్తున్న సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిసిడిఒ ప్రమోద హెచ్చరించారు. సిబ్బంది పనితీరు బాగాలేదని ఫిర్యాదులు వస్తున్నాయని వెంటనే సరి చేసుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.స్థానిక కస్తూరిబా విద్యాలయ్యాన్ని బుధవారం తనిఖీ చేశారు. ఇటీవల విద్యాలయంలో చదువుతున్న ఓ బాలిక అదశ్యమైన ఘటనపై సిబ్బందిని విచారించారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిడిఒ మాట్లాడుతూ విద్యాలయంలో చదివే బాలికలను తమ తల్లిదండ్రులకు ఇతరులతో బయటకు పంపినట్లు తెస్తే సంబంధిత వ్యక్తులను ఉద్యోగ బాధ్యతల నుంచి తొలగి స్తామని హెచ్చరించారు. సిబ్బందిలో సమన్వయ లోపం ఉందని ఇదే తీరులో వ్యవహరిస్తే కొందరిపై వేటు తప్పదన్నారు. విద్యార్థులకు చదువు చెప్పాల్సిన బోధకులు బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్నారని, ఇలాంటి సమస్యలు తిరిగి తలెత్తకుండా చూసుకోవాలన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు బాలికలకు మంచి తర్ఫీదు నివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు జె.ప్రసాద్‌రావు, ఆర్.కొండారెడ్డి, ప్రిన్సిపల్ ఎస్ఆర్. రేష్మ, సిబ్బంది పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలిక ఆచూకీ లభ్యం

వివరాలు వెల్లడించిన డిఎస్‌పి రామరాజు

ప్రజాశక్తి-పామూరు

అదృశ్యమైన బాలిక ఆచూకీ లభ్యమైనట్లు కనిగిరి డిఎస్‌పి రామరాజు తెలిపారు. సిఐ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. డిఎస్‌పి కథనం ప్రకారం... సిఎస్‌పురంలోని కస్తూరిబా పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని ఈనెల 24న నుంచి కనిపించడం లేదు. ఆ బాలిక ఒంగోలులో ఉన్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసు సిబ్బంది మూడు బృందాలు ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. సిఎస్.పురం సర్వేర్‌గా పని చేస్తున్న గోపిరెడ్డి అనే వ్యక్తి ఈనెల 24న బాలికను తన రూములో ఉంచాడు. 26న ఒంగోలు బస్టాండ్ వద్ద విడిచి పెట్టారు. ఈ నేపథ్యంలో గోపిరెడ్డిని పోలీసు స్టేషన్ పిలిపించి విచారించారు. ఆ బాలికను ఒంగోలు వదిలినట్టు గోపిరెడ్డి చెప్పాడు. అనంతరం గోపిరెడ్డి అతని స్నేహితులతో కలిసి ఒంగోలు వెళ్లి బాలిక ఆచూకీ గాలింపు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ బాలిక ఆచూకీ లభ్యం కాకపోవడతో పోలీసులు అరెస్టు చేస్తారనే భయంతో గోపిరెడ్డి రైలు కిందపడి చనిపోయాడు. ఈ క్రమంలో బాలిక బంధువుల సమాచార మేరకు పోలీసులు, బాలిక బంధువులు గాలింపు చర్యలు ఒంగోలులో బాలికను గుర్తించి పామూరు సిఐ కార్యాలయానికి తీసుకొచ్చారు. అనంతరం వైద్య పరీక్షల నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో రాచర్ల ఎస్ఐ కష్ణ పావని, సిఐ నాయక్, పామూరు ఎస్ఐ సైదుబాబు, సిఎస్‌పురం ఎస్ఐ ప్రేమకుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



అవార్డు గ్రహీతలకు సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-కొండపి

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను సైన్సుడే సందర్భంగా ఘనంగా సన్మానించారు. స్థానిక ఎంఆర్‌సి భవనంలో ప్రధానో పాధ్యాయులలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు సురేఖ, రామారావు ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.అరుణ, మిట్టపాలెం హెచ్‌పి పాఠశాల ప్రధానో పాధ్యాయుడు యం.వీరయ్య, ముప్పవరం జడ్‌పి హెచ్ స్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు జి.శివశంకర్, పెట్లూరు ఆదిఆంధ్ర పాఠశాల ప్రధానో పాధ్యాయుడు సిహెచ్.చంద్రశేఖర్, స్కూల్ అసిస్టెంట్ కె.హనుమంతం ావును సన్మానించారు. ఈ కార్యక్ర మంలో వివిధ పాఠశాలల ప్రధానో పాధ్యాయులు, పాల్గొన్నారు.

బైకు బోల్తా .. వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి- సిఎస్ పురంరూరల్

ప్రమాదవశాత్తు బైకు అదుపుతప్పి బోల్తా కొట్టిన ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన సిఎస్‌పురం చెరువు కట్టపై బుధవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మండల పరిధిలోని ఆర్కేపల్లి గ్రామానికి చెందిన చావా జానకి రాములు గాయపడ్డాడు. రాములు బైకుపై సిఎస్‌పురం వచ్చి తమ స్వగ్రామానికి వెళు తున్నాడు. ఈ క్రమంలో చెరువు కట్ట పైనుంచి కిందకి దిగే సమయంలో బైకు అదుపు తప్పి బోల్తా కొట్టింది. దీంతో జానకి రాములు తలకు గాయాలయ్యాయి.



వేణుబాబుకు నివాళులర్పిస్తున్న మంత్రి నాగార్జున

కృపారావుకు మంత్రి నివాళి

నాగులుప్పలపాడు : మండల పరిధిలోని మట్టిగుంట గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు, యుటిఎఫ్ నాయకుడు యాదల కృపారావు అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, వైసిపి సంతనూతలపాడు నియోజక వర్గఇన్‌ఛార్జి మేరుగ నాగార్జున సందర్శించి పూలమాలల వేసి నివాళు లర్పించారు అనంతరం కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అనంతరం చదలవాడ ఎస్‌సి కాలనీలో గుండెపోటుతో చనిపోయిన వైసిపి కార్యకర్త పులి వేణుబాబు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చౌటపాలెం ,అమ్మనబ్రోలు నిర్వహించిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మంత్రి సురేష్

మంత్రి సురేష్ నివాళి

కొండపి : కొండపి పంచాయతీకి చెందిన పల్లె పెద బ్రహ్మయ్య, మేడిద పెద్దశింగయ్య అనే వైసిపి నాయకులు అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. వారి మృతదేహాలను రాష్ట్ర పురపాల శాఖ మంత్రి , వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సందర్శించి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం మృతుల కుటుంబసభ్యులు పరామర్శించారు. బాధిత కుటుంబాలకు వైసిపి అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ఆరికట్ల కోటిలింగయ్య, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

సిఎస్.పురం : మండల పరిధిలోని సిహెచ్ఎన్ పల్లి గ్రామానికి చెందిన టిడిపి యువ నాయకుడు షేక్ నాయబ్ రసూల్ గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను టిడిపి కనిగిరి నియోజకవర్గం ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి బుధవారం పరామర్శించి సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రకమంలో టిడిపి మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, మాజీ ఎంపిపి పెద్దఅల్లూరయ్య, నాగిశెట్టి చిన్నమాలకొండయ్య, మన్నేపల్లి శ్రీనివాసులు, డి.నారాయణ, గోపి, నరసింహారావు పాల్గొన్నారు.



అంబేద్కర్‌కు నివాళి అర్పిస్తున్న ఎలీషా

అంబేద్కర్ ఆశయాలు కొనసాగించాలి

ప్రజాశక్తి - పర్చూరు

అంబేద్కర్ ఆలోచనా విధానాలను కొనసాగించాలని జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ డైరెక్టర్ వేముల ఎలిషా అన్నారు. స్థానికంగా వివాహ వేడుకలకు ఇచ్చేసిన ఆయన వధూవరులను ఆశీర్వదించారు. బొమ్మల సెంటర్లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన వెంట దళిత నాయకులు నలిగల కిషోర్ బాబు, బోయిన మోషే, బిల్లా ఆరోగ్యం, గద్దె జాన్, చింతా సురేష్, బండికళ్ళ రవి, భూషణం, మహేష్, తెలగతోటి సతీష్, కట్టా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కూరగాయల మార్కెట్‌లో బత్తుల బ్రహ్మానందరెడ్డి

కూరగాయల మార్కెట్ పరిశీలన

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

దేశంలోనే ప్రసిద్ధి గాంచిన మార్టూరు కూరగాయల మార్కెట్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర మార్కెటింగ్ కోఆపరేషన్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి తెలిపారు. మార్కెట్‌ను సందర్శించిన ఆయన రూ.22లక్షలతో రైతులు మార్కెట్లోని కూరగాయల వ్యాపారుల సౌకర్యార్థం నిర్మించిన ఫ్లడ్ లైట్లను పరిశీలించారు. మార్కెట్లోని 232మంది హమాలీలకు యూనిఫారం, కొత్తగా లైసెన్సులు వైసిపి ఇంచార్జ్ యడం బాలాజీతో కలిసి త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. మార్కెట్ అభివృద్ధి కోసం రూ.70లక్షలు మంజూరు చేయించామని తెలిపారు. రూ.48 లక్షలతో పలు అభివృద్ధి పనులు త్వరలో పూర్తి చేయను న్నట్లు తెలిపారు. ప్రస్తుత కూరగాయల మార్కెట్లోని సివిల్ సప్లై గోడౌన్‌ను మార్కెట్ పక్కన గల నూతన గోడౌన్‌లోకి మార్చనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పఠాన్ కాలేషా వలి, గడ్డం మస్తాన్ వలి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వి వెంకటరామయ్య

1 నుంచి పసుపు రైతుల దీక్ష

ప్రజాశక్తి - వేమూరు

గుంటూరు జిల్లా దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజిలో జరిగిన అగ్ని ప్రమాదంలో పసుపును కోల్పోయిన రైతులకు ప్రభుత్వం తక్షణం న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఎపీ రైతు సంఘం ఆధ్వర్యంలో మార్చి 1నుండి 3వరకు రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వేములపల్లి వెంకట్రామయ్య తెలిపారు. తెనాలి, వేమూరు నియోజకవర్గాల పరిధిలోని పసుపు రైతులు ధర్నాకు అధిక సంఖ్యలో రావాలని కోరారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రమాదం జరిగి సుమారు 40రోజులు కావస్తున్నప్పటికీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని అన్నారు. కోల్డ్ స్టోరేజీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. దుగ్గిరాల తహశీల్దారు కార్యాలయం వద్ద జరిగే రిలే దీక్షలకు రైతులు హాజరై ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం ఉపాధ్యక్షులు ములక సాంబిరెడ్డి, జై బాలరాజు, బోనిగల సుబ్బారావు, బ్రహ్మయ్య, సాంబశివరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ప్రయోగాల ప్రదర్శన



విద్యార్థుల ప్రయోగాలు పరిశీలిస్తున్న హెచ్‌ఎం సల్మాన్



ఇంకొల్లులో వైజ్ఞానిక గ్రంధాన్ని ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎం

ప్రజాశక్తి - చీరాల

విద్యార్థులందరూ మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని, సైన్స్ అనేది నిత్య జీవితానికి దగ్గరగా ఉంటుందని పేరాల ఎఆర్‌ఎం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి సాల్మన్ రాజు అన్నారు. విద్యార్థులు ప్రజలకు ఉపయోగకరమైన ప్రయోగాలు చేయడం అభినందనీయమని అన్నారు. ఏపికాస్ట్ జిల్లా కో ఆర్డినేటర్ పవని భానుచంద్ర మూర్తి మాట్లాడుతూ దేశంలో ఎంతో మంది ప్రతిభావంతులు ఉన్నారని అన్నారు. అందులో మనం చూసిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల ప్రతిభ, మేథాశక్తిని అభినందించారు. ఉత్తమ ప్రయోగాలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు వై గాంధీ, రాజేంద్ర ప్రసాద్, బాల శంకర్, యల్లమందేశ్వ రరావు, పేరెంట్స్ కమిటీ అధ్యక్షురాలు యదాలమ్మ పాల్గొన్నారు.

సంతమాగులూరు : బాల మేధావులను, శాస్త్రవేత్తలను తయారు చేసే విద్యాలయాలు ప్రయోగశాలలుగా మారాలని హెచ్‌ఎం మంచు అర్జునరావు కోరారు. మండలంలోని మక్కెనవారిపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో సైన్స్ డే వేడుకలు బుధవారం జరిగాయి. సృజనాత్మకమైన 150 ప్రయోగాలను తయారు చేసిన బాల విజ్ఞాన శాస్త్రవేత్తలను ప్రోత్సహిస్తున్న సైన్స్ డిపార్ట్ మెంట్‌కు అభినందనలు తెలిపారు. సైన్స్ ఉపాధ్యాయులు మోహనాంజలి, రహిమాన్, శ్రీరామ్ ప్రసాద్, సరళిను అభినందించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో సైన్స్ ఫెయిర్‌లో పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చినందుకు అభినందించారు.

ఇంకొల్లు రూరల్ : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో వైజ్ఞానిక బహిరంగ సభ నిర్వహించారు. మేడూరి సత్యనారాయణ రచన వైజ్ఞానిక దృక్పథం గ్రంథాన్ని హెచ్‌ఎం తమ్మినేని ఆదినారాయణ ఆవిష్కరించారు. సైన్స్ ఉపాధ్యాయులు ఎ ఉమామహేశ్వరరావు గ్రంథాన్ని సమీక్ష చేశారు. అందరూ చదవవలసిన గ్రంథం అన్నారు. ఆదినారాయణ ప్రసంగిస్తూ పిల్లలు వైజ్ఞానిక దృక్పథంతో ఉన్నత స్థానాలకు చేరాలని అన్నారు. ఉమామహేశ్వరరావు మాట్లాడారు. స్థానిక ఆదర్శ హైస్కూలులో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకున్నారు. పిన్నక ఆంజనేయులు విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను పరిశీలించారు. కరస్పాండెంట్ తోటకూర విజయ భాస్కర్ విద్యార్థులను అభినందించారు. ఇడుపులపాడు విద్యా పరిషత్ ఉన్నత పాఠశాల్లో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. చంద్రశేఖర్ వెంకటరామన్ (సివి రామన్) జీవిత చరిత్రను హెచ్‌ఎం పిడపర్తి పేరిరెడ్డి వివరించారు. నివేదిత హైస్కూలు ఆవరణలో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ పి సుధాకర్ అధ్యక్షత వహించారు. శాస్త్రవేత్తల వేషధారణలో చిన్నారులు అలరించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ డి సుబ్బారావు, అకడమిక్ డైరెక్టర్ వై సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు.

చెరుకుపల్లి : సైన్స్ పరిశోధనాత్మక ఆవిష్కరణ అని మండలంలోని గుల్లపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కోనేటి కవిత అన్నారు. సైన్సు దినోత్సవం సందర్భంగా పాఠశాల్లో బుధవారం జరిగిన కార్యక్రమంలో సైన్స్ పితామహుల చిత్రపటాలకు పూలమాలలతో నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఇన్చార్జి హెచ్‌ఎం వాకా శ్రీనివాసరావు, విద్యా కమిటీ చైర్మన్ విజయకిషోర్ పాల్గొన్నారు.

అద్దంకి : చిన్నారుల సైన్స్ ఎగ్జిబిషన్లో సైన్స్ పరికరాలను పరిశీలించి చిన్నారులకు ఎస్ఐ రత్నకుమారి అభినందనలు తెలిపారు. స్థానిక భాష్యం స్కూల్లో విద్యార్థులు తయారు చేసిన సైన్స్ పరికరాలతో బుధవారం సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాలను పరిశీలించారు. ఒక్కొక్క పరికరాన్ని పరిశీలించి ప్రాధాన్యతను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల దశ నుండే సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలని సూచించారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకొని ప్రతి విద్యార్థి ఒక సైంటిస్ట్‌గా తయారై దేశానికి సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జివిఎల్ శాస్త్రి, హెచ్‌ఎం కాకాని కల్పన, హేమలత, ఉమామహేశ్వరి, జ్యోతి కుమారి, భార్గవి పాల్గొన్నారు.



చెరుకుపల్లిలో సైన్సు పితామహుల చిత్రపటాలకు నివాళి



సంతమాగులూరులో ప్రశంసా పత్రం ఇస్తున్న హెచ్‌ఎం

దర్జీ వృత్తిని ప్రభుత్వం గుర్తించాలి



బాపట్లలో టైలర్స్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న దర్జీలు



చీరాలలో టైలర్స్ దినోత్సవ సభలో అసోసియేషన్ నేతలు

ప్రజాశక్తి - బాపట్ల

కుట్టు మిషన్ సృష్టికర్త ఇలియాస్ హెూ వే జయంతి సందర్భంగా ప్రగతి టైలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్ డే బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇలియాస్ హెూవే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. అసోసియేషన్ అధ్యక్షులు వేల్పుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దర్జీ వృత్తిని ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు. భవిష్యత్తులో టైలరింగ్ వృత్తిని నేర్చుకునే వారు లేక వృత్తి మనుగుడకే ముప్పు వాటిల్లే పరిస్థితి ఎదురవుతుందని అన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం టైలరింగ్ శిక్షణ కేంద్రాలను విస్తృతంగా ఏర్పాటు చేసి భవిష్యత్తులో దర్జీ వృత్తిని కాపాడాల్సిన బాధ్యతను గుర్తించాలని అన్నారు. అలపర్తి శ్రీనివాసరావు, అలపర్తి నాగేశ్వరరావు, మోదుగుల భాస్కరరావు, ఉప్పలపాటి మాధవరావు, వేల్పూరి శ్రీనివాసరావు, షేక్ జిలాని, షేక్ మౌలా సాహెబ్, ప్రగతి టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్‌కె అల్లాబక్షు, పొన్నాడ శ్రీనివాసరా వు, షేక్ పీరా, షేక్ ఖాదర్, మస్తాన్, షేక్ నజీర్ పాల్గొన్నారు.

చీరాల : వేటపాలెం మండలం కొత్తపేట పంచాయితీ కార్యాలయం, చీరాల పట్టణం ఎంజిసి మార్కెట్, బాపనమ్మ కళ్యాణ మండపం వద్ద టైలర్స్ జెండాలు ఆవిష్కరించారు. విలియం హెూవే, కెఎం స్వామి చిత్రపటాలకు నివాళులర్పించారు. కొత్తపేటలో 20మందికి కుటు మిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొత్తపేట మాజీ సర్పంచి చుండూరు వాసు, దామర్ల శ్రీకృష్ణ, ఎన్ఎం ధర్మా, పులిపాటి బాబురావు, కెవిపిఎస్ అధ్యక్షులు లింగం జయరాజు, పేర్లి రత్నం, టైలర్స్ గౌరవాధ్యక్షులు షేక్ మగ్దూంబాష, ఎస్ఎ ఆఫీజ్, అందె తిరుపతిరావు, అమీనుర్దన్, గోలి జేజిబాబు, బిట్ర శ్యామ్‌సుందరరావు, సయ్యద్ అజీస్, గొర్తి భాస్కరరావు, మారుతీప్రసాదు, షేక్ బాష పాల్గొన్నారు.

ఇంకొల్లు : శ్రీ మాతా మహిళా సేవా సంఘం ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ ఆవరణలో టైలర్స్ డే ఘనంగా నిర్వహించారు. కాకుమానుకు చెందిన ప్రగతి మహిళా మండలి అధ్యక్షురాలు అరి సత్యవతి, ఇంకొలుకు చెందిన షేక్ నసీంను ఘనంగా సత్కరించారు. మహిళా సేవా సంఘం అధ్యక్షురాలు ఇంటూరి రమణ, కె అనంతమ్మ, కరి శ్రీహరి, బిందు మాధవి, జాగార్లమూడి కవిత, రావి మాధవి పాల్గొన్నారు.

అద్దంకి : టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 19వ టైలర్స్ డే స్థానిక ముస్లిం షాదీఖానాలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ వ్యక్తిగత సహాయకుడు కె సారథి హాజరయ్యారు. టైలర్స్ సమస్యల గళాన్ని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అసెంబ్లీలో వినిపించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. ఉపాధ్యక్షుడు నాగినేని రామకృష్ణ, డాక్టర్ చదలవాడ ఫణీంద్ర బాబు, చిన్ని శ్రీనివాసరావు, కాకాని అశోక్, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ధర్మవరపు నాగేశ్వరరావు, కౌన్సిలర్లు కంపా రజని, జహీరా, అత్తులూరి రమేష్, టైలర్స్ యూనియన్ అధ్యక్షుడు గోరంట్ల అచ్చయ్య, షేక్ మదీనా, ఎన్ఆర్ ఖాశిం, షేక్ వలి, కరిముల్లా పాల్గొన్నారు.

మార్టూరు రూరల్ : దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న దర్జీల సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రావుల బాపయ్య కోరారు. షేక్ ఖాజావలి, పఠాన్ ఖాదర్ వలి ఆధ్వర్యంలో టైలర్స్ డే వేడుకలు విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో బుధవారం నిర్వహించారు. సిపిఐ (ఎంఎల్) రెడ్ స్టార్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహమ్మద్ బాషా మాట్లాడారు. డాక్టర్ తుర్లపాటి శ్రీనివాసరావు, తగెడ్త ఆంజనేయులు, మహిళా టైలర్స్ అధ్యక్షురాలు మంగళగిరి వెంకట బాల నాగేశ్వరి, షాహిదా పాల్గొన్నారు.

నిజాంపట్నం : స్థానిక మెయిన్ బజార్లో టైలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా టైలర్స్ దినోత్సవం నిర్వహించారు. టైలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ ప్రెసిడెంట్ బొమ్మిడి గాంధీ మాట్లాడుతూ కుట్టు మిషన్ సృష్టికర్త విలియమ్స్ హెూవే జన్మదినమైన ఫిబ్రవరి 28న ప్రపంచ టైలర్స్ డేను జరుపుకుంటారని చెప్పారు. వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా దుస్తులను కుట్టడం ఒక మంచి కళని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఎస్‌కె అన్సారీ, సెక్రటరీ చింతా నాగరాజు, వైస్ సెక్రటరీ బొమ్మిడి శ్రీను, ట్రెజరీ కొక్కిలిగడ్డ లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు బి సుబ్బారావు, సిహెచ్ సాయి, నియోజకవర్గ టైలర్స్ ఇన్చార్జి సిహెచ్ సుబ్రహ్మణ్యం, టైలర్స్ జగన్, కె అంతిరాజులు, ఎస్‌కె పార్క్ జానీ, మహిళా టైలర్స్ పాల్గొన్నారు.




అద్దంకిలో సీనియర్ టైలర్లకు ఘన సన్మానం



మార్టూరులో టైలర్ల దినోత్సవ సభలో రావుల బాపయ్య

రైతులకు అండగా ప్రభుత్వం



చెక్కు అందజేస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ గోపాలకృష్ణ

- ఇన్‌చార్జి కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ
- రైతు భరోసాలో

రూ.59.67 కోట్ల చెక్కు అందజేత

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ వారికి అండగా నిలుస్తుందని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఆర్.గోపాల కృష్ణ తెలిపారు. అందులో భాగంగా వరుసగా ఐదో ఏడాది వైఎస్ఆర్ రైతు భరోసా-పిఎం కిసాన్ పథకంలో ఈ ఏడాది మూడవ విడతగా రూ.2 వేల చొప్పున 2,95,585 మంది రైతన్నల ఖాతాల్లో రూ.59.67 కోట్లను జమ చేసిందన్నారు. బుధవారం వైఎస్ఆర్ రైతు భరోసా - పి ఎం కిసాన్" పథకం లో వడ్డీ రాయితీ "వైఎస్ఆర్ సున్న వడ్డీ పంట రుణాలు" పథకంలో తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుండి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రైతులకు ఆర్థిక సహాయాన్ని రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. ఒంగోలు కలెక్టరేట్ లోని వీడియో సమావేశ మందిరం నుంచి ఇన్‌ఛార్జి జిల్లా కలెక్టర్ ఆర్. గోపాల కృష్ణ, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రవీంద్ర రెడ్డి, పిడిసిసి బ్యాంకు ఛైర్మన్ వైఎం ప్రసాద్ రెడ్డి, పలువురు లబ్దిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ రైతు భరోసా - పి ఎం కిసాన్ పథకంలో 5వ ఏడాది 3వ విడతలో జిల్లాలోని 2,95,585 మంది రైతులకు 59.67 కోట్ల రూపాయల చెక్కును, వైఎస్ఆర్ సున్నా వడ్డీ పంట రుణాలలో జిల్లాలోని 39,263 మంది రైతులకు 11.01 కోట్ల రూపాయల చెక్కును ఇన్‌ఛార్జి కలెక్టర్ అందచేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

సిఎం దృష్టికి ఉద్యోగుల సమస్యలు

- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని
- ఘనంగా ఎన్జీవో సంఘం

భవనం ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని ఒంగోలు శాసనసభ్యులు బాలినేని శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ నాన్ గజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్మించిన కొత్త భవనాన్ని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి బుధవారం ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమానికి ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.శరత్ బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఎన్జీవో ఉద్యోగుల సంఘం కొత్త భవనాన్ని ప్రారంభించుకోవటం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. జిల్లాలో ఉద్యోగుల సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కార దిశగా కృషి చేస్తానని తెలియజేశారు. ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ తమ అన్న స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి నుంచి ఎన్జీవో అసోసియేషన్ నాయకులతో అనుబంధం ఉందన్నారు. గతంలో ఎన్జీవో భవన నిర్మాణానికి మాగుంట సుబ్బరామరెడ్డి ఆర్థిక సాయం చేశారని, తాను ఎంపి ల్యాడ్స్ నుంచి భవన నిర్మాణానికి నిధులు ఇచ్చామన్నారు. ఉద్యోగులంతా కొత్త భవనంలో వివిధ కార్యక్రమాలు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కూచిపూడి శరత్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని శాఖల ఉద్యోగులు వారి కుటుంబ ఫంక్షన్లను సంఘ భవనంలో జరుపుకోవడానికి అందుబాటులో ఉంటుందని తెలియజేశారు. రాష్ట్ర నాన్ గజిటెడ్ ఉద్యోగుల సంఘ అధ్యక్షులు బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అసోసియేషన్ ఎప్పుడు ముందు ఉంటుందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఎన్జీవో కొత్త భవనం నిర్మించేందుకు ఉద్యోగులు, సంఘ నాయకులు ఎంతో కష్టపడ్డారన్నారు. తమ హయాంలో ప్రారంభమైన భవన నిర్మాణం అన్ని హంగులతో ముస్తాబు కావటం సంతోషంగా ఉందన్నారు. ఈ భవనాన్ని ఉద్యోగులందరూ ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె శివారెడ్డి, ప్రభుత్వ సలహాదారు ఏపి చంద్రశేఖర్ రెడ్డి, సహాధ్యక్షులు శ్రీ సిహెచ్ పురుషోత్తమ నాయుడు, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత ప్రసంగించారు. కార్యక్రమంలో అన్ని జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులతో పాటు పాటు జిల్లాలోని అన్ని తాలూకా యూనిట్ల అధ్యక్ష కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ హెచ్ కృష్ణారెడ్డి ఎన్జీవో సంఘ నాయకులు వెంకటేశ్వరరావు, కోశాధికారి శివకుమారి కార్యనిర్వాహక కార్యదర్శి ఏడుకొండలు, రోజ్ కుమార్, తోట శీను, ప్రసన్న, విజయ, పట్టణ సంఘ అధ్యక్షులు కొత్తపల్లి మంజేష్, కార్యదర్శి సరిత, వీరయ్య, సునీల్, నాగరాజు పాల్గొన్నారు.

'శ్రీ గాయత్రి'లో సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పేర్నమిట్ట పరిధిలోని సమతానగర్‌లో ఉన్న శ్రీ గాయత్రి గ్రామర్ స్కూల్‌లో సైన్స్ డే సందర్భంగా బుధవారం ఏర్పాటుచేసిన సైన్స్ ఎక్స్‌పో అండ్ కార్నివల్‌ను ఎంఇఒ దగ్గుమాటి వెంకారెడ్డి సందర్శించారు. విద్యార్థుల చేసిన పలు ప్రయోగాలను తిలకించి.. వారిని అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రామలక్ష్మి, ప్రిన్సిపల్స్ ఎవి.జగదీష్, పి.జ్యోతిర్మయి, సిబ్బంది పాల్గొన్నారు.



సైన్స్ ఎక్స్‌పో సందర్శించిన ఎంఇఒ వెంకారెడ్డి

ఫలించిన ఐక్యపోరాటం

దళిత యువకుడి విషయంలో

చట్టాన్ని కాలరాసిన

పోలీసులకు జైలుశిక్ష

ప్రజాశక్తి-పంగులూరు

అధికారపార్టీ నాయకుల మాటలు విని.. అధికారం చేతిలో ఉందని.. తన ఇష్టం వచ్చినట్లు వ్యవహరించినా ఎవరూ ఏమీ చేయలేరని ఓ దళిత యువకుడిని దారుణంగా హింసించిన పోలీసులకు ఎట్టకేలకు శిక్ష పడింది. చట్టాన్ని కాలరాసి, బాధితులను పోలీస్‌స్టేషన్లో చితక బాదిన ఎస్సై, కానిస్టేబుల్‌కు న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. దళిత యువకులకు అండగా సిపిఎం, కెవిపిఎస్ చేసిన పోరాటం ఫలించింది.

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని జె.పంగులూరు మండలం కోటపాడుకు చెందిన నేలపాటి ఇమ్మాన్యుయేల్, మందా వెంకటేశ్వర్లు ఆర్థిక లావాదేవీల విషయంలో గొడవపడి 2016 జనవరి 5న పరస్పరం దాడి చేసుకున్నారు. అనంతరం ఇద్దరూ ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకోగా, పెద్దలు రాజీ కుదిర్చారు. వాటిని ఉపసంహరించుకోవాలని చెప్పారు. దీంతో వారు అదే నెల 9న కేసుల ఉపసంహరణ నిమిత్తం పోలీసుస్టేషన్‌కు వెళ్లారు. అప్పటి జె.పంగులూరు ఎస్సై బలగాని జగన్మోహనరావు వారిని మందలించారు. అనంతరం ఇమ్మాన్యుయేలును పిలిచి స్టేషన్లో నిర్బంధించి దాడి చేశాడు. దీనిపై ఎస్సైను ప్రశ్నించిన గోళ్లమూడి తిరుపాలును, కానిస్టేబుల్ కాసా కిరణ్ కుమార్‌తో కలిసి తాడుతో బంధించి, సీలింగ్ కొక్కేనికి వేలాడదీసి చితకబాదారు. తీవ్ర గాయాలపాలైన తిరుపాలు అర్ధంకి ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి సదరు పోలీసులపై ఫిర్యాదు చేశారు.

గ్రామంలో పోరాటం చేయటం వల్లే..

కోటపాడు గ్రామానికి చెందిన గోళ్ళమూడి తిరుపాలు గ్రామంలో ఉన్న మద్యం బెల్ట్ షాపులను తీసి వేయాలని పోరాటం చేశాడు. ఆయన నాయకత్వంలో దళిత మహిళలు మద్యం షాపులపై దాడి చేశారు. మద్యం సీసాలను పగలగొట్టారు. దళిత కాలనీకి తాగునీటి పైపులైను కావాలని తిరుపాలు పోరాడి పైప్‌లైన్ వేయించాడు. గ్రామంలో ఇళ్ల స్థలాల కోసం, పక్కా ఇళ్ల కోసం, పేదలను కూడగట్టి పోరాటాల వైపు మళ్లించాడు. దీనిపై ఆ గ్రామ పెద్దలకు తిరుపాలును ఏదో విధంగా కట్టడి చేయాలనే ఆలోచన ఏర్పడింది. ఏ విషయంలోనూ వారికి తలవంచకపోవటంతో.. చివరికి పోలీసుల ద్వారా లొంగ తీసుకోవాలని ప్రయత్నం చేశారు. అందులో భాగంగానే తిరుపాలును ఏ నేరం చేయకపోయినా పోలీసులు నిర్బంధించి తాళ్లతో కట్టి దారుణంగా కొట్టారు.

దళితుల ఐక్య పోరాటమే రక్ష

గొల్లమూడి తిరుపాలును పోలీసులు అన్యాయంగా అక్రమంగా నిర్బంధించి చావు దెబ్బలు కొట్టిన సమయంలో తిరుపాలుకు మద్దతుగా సిపిఎం, కెవిపిఎస్ నాయకత్వంలో కోటపాడు దళిత కాలనీ మొత్తం పోరాటానికి దిగింది. పోలీసులు చేసిన ఈ దుశ్చర్యకు నిరసనగా అర్ధరాత్రి దళిత కాలనీ మొత్తం వచ్చి రేణింగవరం పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా చేశారు. ఎస్సై కానిస్టేబుల్ శిక్షించాలని నినాదాలు చేస్తూ రాత్రంతా పోలీస్ స్టేషన్ ముందు బైటాయించారు. తిరుపాలుకు జరిగిన అన్యాయంపై మొత్తం కదిలి రావడం ఈ పోరాటానికి స్ఫూర్తినిచ్చింది.

రాజీ ప్రయత్నాలు విఫలం

తిరుపాలును కారణం లేకుండా చితకబాదిన ఎస్సై జగన్మోహనరావు, కానిస్టేబుల్ కిరణ్‌కుమార్‌పై కేసు పెట్టడంతో వారి ఉద్యోగాలకు ప్రమాదం ఏర్పడింది. ఉద్యోగాలు ఊడిపోతాయన్న భయంతో తాము తప్పు చేశామని, క్షమించాలని ఒంగోలు, పంగులూరులలోని సిపిఎం, కెవిపిఎస్ నాయకుల వద్దకు అనేకసార్లు జగన్మోహనరావు రాజీ కోసం తిరిగాడు. రాజీకి వస్తే భారీ మొత్తంలో డబ్బు కూడా ఇస్తానని ప్రలోభాలు పెట్టడానికి ప్రయత్నించాడు. అయితే తప్పు చేసిన వారికి న్యాయస్థానంలో శిక్ష పడాల్సిందేనని, తాము రాజీకి వచ్చే ప్రశ్నే లేదని సిపిఎం, కెవిపిఎస్ నాయకులు తేల్చి చెప్పారు. దళితుల పట్ల చిన్నచూపు చూస్తూ.. రాజకీయనాయకుల మాటలు నమ్మి.. చేసిన దుర్మార్గపు పనులకు శిక్ష తప్పదని స్పష్టం చేశారు. రాజీ కోసం జగన్మోహనరావు చేసిన ప్రయత్నాలు పూర్తిగా విఫలమయ్యాయి.

ఈ కేసును విచారించిన న్యాయమూర్తి డి.అమ్మన్నరాజా నిందితులైన ఎస్సై జగన్మోహనరావు, కానిస్టేబుల్ కిరణ్‌కుమార్‌లకు మూడేళ్ల చొప్పున జైలు శిక్ష, రూ.23 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసు విషయంపై అనేక సందర్భాల్లో తిరుపాలును పోలీసులు రకరకాలుగా రాజీలకు రావాలని అనేకమంది పెద్ద మనుషులతో భయభ్రాంతులకు గురిచేసిన సందర్భాలు ఉన్నాయి. నిత్యం సిపిఎం, కెవిపిఎస్ అండదండలిస్తూ ధైర్యాన్ని నింపుతూ బాధితుడి పక్షాన నిలబడ్డాయి.

న్యాయం గెలిచింది..



బి.రఘురాం కెవిపిఎస్ ప్రకాశం జిల్లా కార్యదర్శి

దళిత యువకుడి పట్ల అమానుషంగా వ్యవహరించి.. చట్టాన్ని కాలరాసిన ఎస్సై, కానిస్టేబుల్‌కు జైలు శిక్ష పడటం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నాం. దళితులపై దాడులు చేసిన సందర్భాల్లో నమోదైన వేలాది అట్రాసిటీ కేసులు పరిష్కారం కాకుండా పోలీస్ స్టేషన్లలో మగ్గుతున్నాయి. తిరుపాలు కేసు పరిష్కారం అయ్యి, నిందితులకు జైలు శిక్ష పడటం హర్షించదగ్గ విషయం. దళితుల పట్ల ఎవరైనా వివక్షగా వ్యవహరించినా, అధికారులు చట్టాన్ని కాలరాసినా శిక్ష తప్పదని తిరుపాలు కేసు నిరూపించింది. దళితులకు ఈ తీర్పు ఎంతో మనోధైర్యాన్ని ఇచ్చింది.

పోరాట ఫలితమే..



సిపిఎం బాపట్ల జిల్లా నాయకుడు రాయిని వినోద్‌బాబు

దళితుడు తిరుపాలును అకారణంగా చిత్రవధ చేసి కొట్టిన ఘటనలో సిపిఎం చేసిన పోరాటం వల్లే ఎస్సైకి, కానిస్టేబుల్‌కు జైలు శిక్ష పడింది. అర్ధరాత్రి తిరుపాలును కొట్టిన సమయంలో నేను, సిపిఎం మండల కార్యదర్శి తలపనేని రామారావు గుడిపాటి మల్లారెడ్డి కలిసి స్టేషన్ దగ్గరికి వెళ్లాం. స్టేషన్ ముందు కోటపాడు దళితుల కాలనీ వాసులను కూర్చోబెట్టి ధర్నా చేశాం. మరుసటి రోజు ఉదయం మహిళా సంఘం నాయకులు రాయని కష్టకుమారి మహిళలందరినీ తీసుకొచ్చి స్టేషన్ ముందు కూర్చోబెట్టింది. తరువాత ఎఫ్ఐఆర్ కోసం సిపిఎం ఆధ్వర్యంలో పంగులూరులో రాస్తారోకో చేశాం. దళితుల కోసం, వారి హక్కుల కోసం సిపిఎం పోరాడుతుంది. ఈ విజయం పేద ప్రజలందరిదీ..

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- 534 మందికి స్థలాలు రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ
- 144 మందికి భూ పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - చీరాల

వైసీపీ ప్రభుత్వంలో అర్హులు అందరకి సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందించటం జరుగుతుందని ఎమ్మెల్యే కరణం బాలరామకృష్ణమూర్తి అన్నారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో వైసీపీ ఇంచార్జి కరణం వెంకటేష్ బాబు ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల, భూ లబ్ధిదారుల పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్బంగా మండలంలోని వివిధ గ్రామాలకి చెందిన లబ్ధిదారులకు నవరత్నాలు పేద లందరికీ ఇళ్ళు 534మందికి మంజూరైన ఇళ్ళ స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేశారు. జగనన్న సంపూర్ణ దళిత భూహక్కు పథకం కింద ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 144 మందికి మంజూరైన భూమి పత్రాలు పంపిణీ చేశారు. ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్జున్ నాయక్, తహశీల్దారు కె నరసయ్య, ఎంపీడీఓ శోభారాణి, ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్ బొనిగల జైసన్ బాబు, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షులు ఆసాది అంకాలరెడ్డి, బొడ్డు సుబ్బారావు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు నల్లబోతుల రాజ్ కుమార్, మాజీ వైస్ ఎంపీపీ నాదెండ్ల కోటేశ్వరరావు, వైసిపి జిల్లా కార్యదర్శి బండారు శివ పార్వతి, ఆర్బీకె ఛైర్మన్ కావూరి రమణరెడ్డి, పిఎసిఎస్ ఛైర్మన్ బోయిన కేశవులు, బుర్ల మురళీకృష్ణ, మేడిపోయిన రత్నారెడ్డి, బిట్రా శ్రీనివాసరావు, వాడరేవు మాజీ సర్పంచి ఎరిపిల్లి రమణ, పర్వతనేని శ్రీనివాసరావు, గుంటూరు సుబ్బారావు, షేక్ మస్తాన్, అక్కల శ్రీనివాసరెడ్డి, పిక్కి నారాయణ, బక్కా అద్దంకిరెడ్డి, పిట్టు నాగిరెడ్డి, తేళ్ల మోష, గోలి నాగరాజు, పిట్టు పోలయ్య, తేళ్ల రాంబాబు పాల్గొన్నారు.


లబ్ధిదారుల పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బలరాం

ఎన్నికలు స్వేచ్ఛగా నిర్వహించాలి

ప్రజాశక్తి - పర్చూరు

ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఎన్నికలు స్వేచ్ఛగా నిర్వహించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, బాపట్ల ఆర్‌డిఒ జి రవీందర్ సూచించారు. రాబోవు ఎన్నికలు సక్రమంగా నిర్వహణకు నియమించబడిన సెక్టార్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అధికారులు, వ్యయ పరిశీలకులు, వివిధ టీంల పోలీసు అధికారులకు బుధవారం స్థానిక రాజ్యలక్ష్మి కల్యాణ మండపలో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్వేచ్ఛాయుత ఎన్నికలు నిర్వహించేందుకు కమిటీ, పోలీస్ అధికారులు పనిచేయాలని అన్నారు. ఎలాంటి అసాంఘిక చర్యలకు తావు లేకుండా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల విధుల నిర్వహణకు కేటాయించిన అధికారులు ఎలాంటి నిర్లక్ష్య వైఖరి అవలంభించినా కఠినమైన చర్యలు ఉంటాయాని హెచ్చరించారు. ఎలాంటి ఫిర్యాదులు రాకుండా విధులు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పర్చూరు ఎఈఆర్ఓ సిహెచ్ సుబ్బయ్య, మార్టూరు ఎఈఆర్ఓ కె సంధ్యశ్రీ, యద్దనపూడి ఎఈఆర్ఓ వై నాగరాజు, కారంచేడు ఎఈఆర్ఓ మెహర్ బాబు, ఇంకొల్లు ఎఈఆర్ఓ ఎం ప్రమీల, చిన్నగంజాం ఎఈఆర్ఓ జివిఎస్ ఫణింద్ర బాబు, బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణ, చీరాల డీఎస్పీ బి ప్రసాద్, ఇంకొల్లు సీఐ బి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.


సమావేశంలో ఇఆర్ఒ, బాపట్ల ఆర్‌డిఒ జి రవీంధర్

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎర్రయ్య వెల్లడి

ప్రజాశక్తి - బాపట్ల

జిల్లాలో మార్చి 3నుండి 20వరకు జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి పి ఎర్రయ్య తెలిపారు. జిల్లాలో 35 పరీక్ష కేంద్రాల్లో మొదటి, రెండో ఏడాది ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేశామని అన్నారు. ఇంటర్మీడియట్ మొదటి ఏడాది జనరల్ విద్యార్థులు 8333మంది కాగా వృత్తి విద్యా కోర్సు పరీక్షలకు 466మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఇంటర్ జనరల్ పరీక్షలకు 10316 కాగా వృత్తి విద్య కోర్సు పరీక్షలకు 447మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఉదయం 9 గంటల నుండి 12గంటల వరకు జరిగే పరీక్షలకు పరీక్షా కేంద్రాలు సిద్ధం చేశామని అన్నారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు తోపాటు పోలీసు, రెవెన్యూ, ఇంటర్మీడియట్ విద్య అధికారులతో రెండు ఫ్లయింగ్ స్క్వాడ్లు, రెండు సిట్టింగ్ స్క్వాడ్లు పరీక్షలను పర్యవే క్షిస్తాయని అన్నారు. ఆన్‌లైన్ ద్వారా జిల్లా ఇంటర్మీడియట్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ పాయింట్ ద్వారా పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. జిల్లాలో బాపట్ల5, పిట్టలవానిపాలెం1, నిజాంపట్నం1, చెరుకుపల్లి3, రేపల్లె4, వేమూరు1, చుండూరు1, చీరాల7, మార్టూరు4, పర్చూరు1, అద్దంకి4, సంతమాగులూరు1, ఇంకొల్లు2 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంటర్ విద్యార్థులు తమ హాల్ టికెట్లను ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ ద్వారా గాని, ఆన్‌లైన్ ద్వారా గాని డౌన్ లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా డౌన్ లోడ్ చేసుకున్న హాల్ టికెట్లను కళాశాల ప్రిన్సిపల్ ధ్రువీకరించనప్పటికీ డౌన్ లోడ్ చేసుకున్న హాల్ టికెట్‌తో పరీక్ష వ్రాసేందుకు అనుమతిస్తారని తెలిపారు. అరగంట ముందుగా విద్యార్థులు పరీక్ష హాల్లో హాజరు కావాలని సూచించారు.


ఎర్రయ్య

పరీక్షలలో ప్రతిభ కనబరచాలి

ప్రజాశక్తి - చెరుకుపల్లి

మండలంలోని గుల్లపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల, కళాశాల విద్యార్థినిలు ఉత్తమ ప్రతిభ కనబరచాలని హెచ్‌ఎం కోనేటి కవిత అన్నారు. శుక్రవారం నుండి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు విద్యార్థినులకు బుధవారం హాల్ టికెట్లు పంపిణీ చేశారు. గత ఏడాది నూతనంగా ప్రారంభించిన మహిళల ఇంటర్మీడియట్ విభాగంలో విద్యార్థినిలు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాల ప్రతిష్టను పెంచాలని విద్యా కమిటీ ఛైర్మన్ మంచాల విజయ్ కిషోర్ బాబు కోరారు. కష్టపడితే ఫలితం ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు అందరి కీ పురస్కారాలు అందజేస్తామని తెలిపారు.


హాల్‌టికెట్లు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం కోనేటి కవిత


వైసిపి నాయకులు మిండాల వెంకటేష్‌కు బాలాజీ నివాళి

వైసిపి నాయకులు 'మిండాల'కు నివాళి

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని చెరుకురు పంచాయితీ పరిధిలోని ఉప్పరపాలెంకు చెందిన వైసిపి నాయకులు మిండాల వెంకటేష్ బుధవారం మృతి చెందారు. ఆయన మృత దేహానికి వైసిపీ ఇంచార్జ్ యడం బాలాజీ నివాళి అర్పించారు. పర్చూరు మాజీ ఎఎంసి ఛైర్మన్ లింగిశెట్టి సుబ్బారావు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఆయన వెంట లింగిశెట్టి రామాంజనేయులు, కఠారి అప్పారావు, మల్లా శ్రీనివాసరావు, కంచనపల్లి రమేష్, గాదె సురేష్, చెరుకూరు సర్పంచి పేరం సుబ్బారావు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ గొట్టిపాటి పర్యటన

ప్రజాశక్తి - పంగులూరు

శాసన సభ్యులు గొట్టిపాటి రవికుమార్ మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం పర్యటిస్తారని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం ప్రతినిధి తెలిపారు. ఉదయం 10:30 గంటలకు ముప్పవరం గ్రామంలోని టిడిపి కార్యాలయంలో జనసేన పార్టీ శ్రేణులతో సమీక్షిస్తారని తెలిపారు. 11 గంటలకు రేణింగవరం, 11:30 గంటలకు తూర్పు కొప్పెరపాడు, 12 గంటలకు కోటపాడు, 12:30 గంటలకు బూధవాడ గ్రామాల్లో పర్యటిస్తారని తెలిపారు.


గొట్టిపాటి రవికుమార్


యుటిఎఫ్ సురేష్ కుమార్తె వివాహ వేడుకల్లో ఆనందబాబు

వివాహ వేడుకల్లో ఆనందబాబు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

యుటిఎఫ్ మండల కార్యదర్శి వి సురేష్ కుమార్ కుమార్తె వివాహ వేడుకలు బుధవారం కొల్లూరు మండలం దోనేపూడిలోని కళ్యాణ మండపంలో ఘనంగా జరిగాయి. ఈ వివాహ వేడుకలకు మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కా వెంకటేశ్వర్లు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకల్లో టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, యుటిఎఫ్ మండల అధ్యక్షులు ఎం .శ్రీనివాసరావు, ఎంఇఒలు పులి లాజర్, నీలం దేవరాజ్ పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన ఘటన బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొరిశపాడు మండల కేంద్రంలో నివాసం ఉండే తేళ్ల శేషగిరి (40) మార్టూరు సమీపంలోని కోనంకిలో జరిగే ప్రార్ధనకు తన బైకుపై వెళుతున్నాడు. ఈ క్రమంలో బొల్లాపల్లి టోల్ ప్లాజా సమీపంలో ఒక్క సరిగా బైక్ అదుపుతప్పడంతో క్రింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిశీలించిన డాక్టర్ భవాని అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు


తేళ్ల శేషగిరి (40)


వాలంటీర్లను సత్కరిస్తున్న యడం బాలాజీ

వాలంటీర్లతో ఉత్తమ సేవలు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ప్రజల ముంగిటకే అన్నిరకాల సేవలు అందించే వ్యవస్థ ఈ ప్రపంచంలో ఏ దేశంలో లేదని, ఒక్క ఆంధ్ర రాష్ట్రంలోనే ప్రజల ముంగిటకు సంక్షేమ పథకాలు చేరువ కావాలనే ఆశయంతో సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వాలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టారని వైసిపి ఇంచార్జ్ యడం బాలాజీ అన్నారు. స్థానిక విజయలక్ష్మి కల్యాణ మండపంలో వాలంటీర్లకు వందనం సభ ఎంపిడిఓ గోరికపూడి నితిన్ అధ్యక్షతన నిర్వహించారు. సభలో ఆయన మాట్లాడుతూ వాలంటీర్ వ్యవస్థ ప్రజలకు అత్యుత్తమ సేవలు అందిస్తోందని అన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరు వలంటీర్ల సేవలు పొందినవారేనని అన్నారు. 359మంది వాలంటీర్లకు పతకాలు, ప్రశంసా పత్రం అందించి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి భూక్యా శాంతి భాయ్, సర్పంచ్ సుమితా భాయ్, వైసిపి నాయకులు ఉప్పలపాటి చెంగాలయ్య, పఠాన్ కాలేషావలి, గడ్డం మస్తాన్ వలి, రాజా నాయక్, పంచాయతీ ఈఓ తన్నీరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.


సూచనలిస్తున్న సిఐ పి నరసింహారావు

గొడవలు పడితే క్రిమినల్ కేసులు

ప్రజాశక్తి - సంతమాగులూరు

జిల్లాలో ఎన్నికల వాతావరణం నెలకొన్న నేపథ్యంలో సంఘ విద్రోహ శక్తుల పట్ల ఉక్కు పాదం మోపనున్నట్లు సిఐ పి నరసింహారావు హెచ్చరించారు. మండలంలోని సంతమాగులూరు, కొప్పరం, సజ్జాపురం గ్రామాల్లో ఆయన బుధవారం పర్యటించారు. పోలింగ్ బూతులను పరిశీలించారు. ఆయా గ్రామాల ప్రజలకు ఎన్నికల పట్ల అవగాహన కల్పించారు. గొడవలకు పోకుండా తమ ఓటును వేసుకోవాలని తెలిపారు. ఇతరుల ఓట్లు వేయరాదని అన్నారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరు శాంతియుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్ఐ సురేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


అవార్డు అందుకుంటున్న చందు వెంకట సతీష్

వేటపాలెం వాసికి ఎక్సలెన్స్ అవార్డు

ప్రజాశక్తి - చీరాల

ఇండియా ప్రైడ్ అవార్డ్స్ ప్రత్యేక స్థాయిలో ఔత్సాహిక యువ వ్యవస్థాపకులను ప్రోత్సహిస్తూ వారి రంగాల్లో విశేష కృషి చేసే యువ వ్యాపారవేత్తలకు ప్రధానం చేసే ఇండియన్ బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డ్స్, పొలిటికల్ డిజిటల్ స్ట్రాటజిస్ట్ అఫ్ ది ఇయర్ 2024ను వేటపాలెం వాసి చందు వెంకట సతీష్ అందుకున్నారు. పొలిటికల్ ఇంజనీర్ వ్యవస్థాపకులు చందు వెంకట సతీష్ రామన్నపేటకు చెందిన దిగువ మధ్య తరగతి చేనేత కుటుంబానికి చెందిన నేత కార్మికులు సుబ్బులు, రమణయ్య దంపతుల పెద్ద కుమారుడు. పొలిటికల్ ఇంజనీర్ సంస్థ ద్వారా జాతీయ, ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ రాజకీయ నాయకులతో కలిసి పనిచేస్తూ వారికి అత్యుత్తమ సేవలను అందించేందుకు డిజిటల్ రంగంలో వారిని ప్రజలతో నిత్యం అనుసంధానం అయ్యేలా చేస్తూ సేవలు అందిస్తున్నారు. బెంగళూరులో నిర్వహించిన అవార్డు ప్రధానోత్సవంలో ప్రెసిడెంట్ అఫ్ ఇండియా నుండి నారీశక్తి అవార్డు పొందిన రాధాదేవి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. తల్లి దండ్రులు, గురువులు తనపై విశ్వాసం ఉంచిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

వరుస దొంగతనాలతో బెంబేలెత్తుతున్న ప్రజలు

● నెల రోజుల వ్యవధిలో ఓకే తరహా చోరీలు ● పోలిసుల ఇళ్లను సైతం వదలని దొంగలు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

వేసిన తాళాలు వేసినట్లే ఉంటాయి. కానీ ఇంట్లో ఆహరణాలు, విలువైన వస్తువులు చోరీ అవుతున్నాయి. మార్టూరు పరిసర గ్రామాల్లో జరుగుతున్న వరుస దొంగతనాలతో ప్రజలు భయాందోళనకు గురౌతున్నారు. గత రెండు నెలలుగా చోరీలు జరుగుతున్న తీరు గమనిస్తే తాళాలు వేసి ఉన్న ఇళ్లే టార్గెట్‌గా దొంగలు రెచ్చి పోతున్నారు. పోలీసుల ఇళ్లను సైతం వదిలిపెట్టకుండా చోరీకి తెగబడుతున్నారు. జనవరి నెలలో కోనంకి గ్రామంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు తవ్వా వాసుదేవరావు, శ్యామలాదేవి దంపతులు పాఠశాలకు వెళ్లిన సమయంలో తాళాలు వేసిన ఇంట్లో పట్ట పగలే దొంగలు జొరబడ్డారు. ఈ ఘటన మరువకముందే జొన్నతాళి వద్ద జాతీయ రహదారిపై ఉన్న భారత్ గ్యాస్ కంపెనీ ఆఫీస్ షట్టర్లు పగల గొట్టి కౌంటర్లో పెద్ద మొత్తంలో ఉంచిన నగదును చోరీ చేశారు. మార్టూరు నాగరాజుపల్లి సెంటర్లో వాసవీ కిరాణా షాప్ నిర్వహించే పోలిశెట్టి మాణిక్యరావు ఫిబ్రవరి 7న స్థానిక స్టేట్ బ్యాంకు నుండి వ్యాపార అవసరాల నిమిత్తం రూ.2లక్షలు నగదు డ్రా చేసి బ్యాంకు బయట ఉన్న స్కూటీలో పెట్టి ఆ ప్రక్కనే మూత్ర విసర్జన చేస్తుండగా నిమిషాల వ్యవధిలో స్కూటీ డిక్కీలో నుండి నగదును గుర్తు తెలియని దుండగుడు తస్కరించి అక్కడి నుండి ఉడాయించాడు. జరిగిన ఘటనపై బాధితుడు అర్బన్ సీఐ ఎస్వి రాజశేఖరరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఫిబ్రవరి 17న జొన్నతాళి గ్రామానికి చెందిన రైతు ఇండేల శ్రీనివాసరెడ్డి వ్యవసాయ పనుల నిమిత్తం తన గ్రామానికే చెందిన మరొక వ్యక్తి దగ్గర రూ.లక్ష నగదు అప్పు అడగడంతో ఆ వ్యక్తి స్థానిక స్టేట్ బ్యాంకులో నగదు డ్రా చేసి ఇచ్చాడు. ఆ నగదుని తన టివిఎస్ వాహనంలో పెట్టుకొని వెళుతున్న రైతుని మరొక బైకుపై వెంబడించిన గుర్తు తెలియని ఆగంతకుడు మీ డబ్బు క్రింద పడిపోయిందిన చెప్పడంతో ఆ డబ్బుని తీసుకుంటున్న సమయంలో టీవీఎస్ వాహనం కవర్లో పెట్టిన రూ.లక్ష నగదును తస్కరించాడు. దుండగుడు అక్కడి నుండి పారిపోయిన ఘటన తెలిసిందే. జరిగిన చోరీలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నప్పటికీ నేటి వరకు ఎటువంటి పురోగతి లేకపోవడం గమనార్హం. ఇప్పటి వరకు జరిగిన చోరీలన్నీ ఒక ఎత్తయితే పోలీసు ఇంట్లోనే చోరీకి తెగబడి దొంగలు పోలీలకు సవాల్ విసిరారు. మార్టూరు స్టేషన్ పరిధిలో బొల్లాపల్లి వరకు జాతీయరహదారిపై హై వే పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్నకానిస్టేబుల్ ఎం యోహాన్ నాయక్ మార్టూరు సమీపంలోని ఇసుకదర్శి మెయిన్ రోడ్డుపై ఉన్న కాలనీలో నివాసం ఉంటున్నాడు. కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లడంతో ఇంటికి తాళం వేసి ఇంటికి కూతవేటు దూరంలో పెట్రోలింగ్ డ్యూటీ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో తాళం వేసి ఉన్న ఇంటిని గమనించిన



చోరీ జరిగిన ప్రదేశంలో పోలీసుల తనిఖీలు

దొంగలు ఇంట్లోకి చొరబడి షుమారు రూ.2.5 లక్షలు విలువగల 4సెవర్ల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, రూ.9వేల నగదును చోరీ చేసి తాపీగా పారిపోయారు. డ్యూటీ అనంతరం ఇంటికి వెళ్లిన యోహాన్ దొంగతనం జరిగినట్లు గుర్తించి సీఐకి సమాచారం ఇచ్చారు. బాపట్ల నుండి వచ్చిన క్లూస్ టీమ్ ఘటన స్థలాన్ని పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. రెండు రోజుల క్రితం జరిగిన ఘటనతో స్థానికులు ఉలిక్కి పడ్డారు. పోలీస్ ఇంట్లోనే దొంగలు యథేచ్ఛగా చోరీకి పాల్పడితే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని భయాందోళనకు గురవుతున్నారు. పోలీస్ స్టేషన్‌ను అర్బన్ స్టేషన్‌గా మార్చి సీఐని కేటాయించిన జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు ఆ స్థాయిలో సిబ్బందిని కూడా కేటాయించి రాత్రి సమయాల్లో గస్తీ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం రమేష్ బాబు

మహిళలకు జీవనోపాధి కల్పించాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

డ్వాక్రా మహిళలకు పాడి పరిశ్రమ, కుట్టు మిషన్ల ద్వారా జీవనోపాధిని కల్పించాలని ఐబీ ఏపీఎమ్ మాచవరపు రమేష్ బాబు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమైక్య ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ధనలక్ష్మి అధ్యక్షత వహించారు. ఐబి ఎపిఎం రమేష్ బాబు మాట్లాడుతూ యానిమేటర్లు ప్రతినెల ఎస్‌హెచ్‌జి విఒ సమావేశాలు నిర్వహించి సభ్యులు తీసుకుని చెల్లించిన రుణాలకు రసీదులు అందజేసి పుస్తక నిర్వహణ క్రమం తప్పకుండా చేయాలని అన్నారు. పుస్తకాలు సక్రమంగా నిర్వహిస్తే ఏ గ్రేడు అందుతుందని సూచించారు. స్త్రీ నిధి ఎటీఎం నాగబాబు మాట్లాడుతూ స్త్రీ నిధి ద్వారా రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి నేరుగా వారికే రుణమందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తీసుకున్న రుణాలను తిరిగి రికవరీ చేయగానే రసీదులు ఇవ్వాలని అన్నారు. రేపల్లె ఏరియా కోఆర్డినేటర్ రమాదేవి మాట్లాడుతూ వైఎస్ఆర్ చేయూత పథకంతో పాటు ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకాన్ని పేద మహిళలకు అందే విధంగా చూడాల్సిన బాధ్యత యానిమేటర్లపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏపిఎం శ్రీమన్నారాయణ, మేనేజరు పిల్లి అశోక్, సీసీలు రజిని, సాంబయ్య, హనోక్, అకౌంటెంట్ శిరీష ఉన్నారు.

ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రభుత్వం పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ప్రైవేటు పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసేందుకు 1వ తరగతి నుండి పై తరగతులకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈఓ పులి లాజర్, నీలం దేవరాజులు తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వం విద్య హక్కు చట్టం ప్రకారం 25శాతం సీట్లు ఉచితంగా అందించాల్సి ఉందన్నారు. దీనికి గాను అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకునేందుకు తల్లిదండ్రులు ముందుకు వచ్చి మార్చి 14లోగా ఆయా సచివాలయాలు, ఇంటర్నెట్ కేంద్రాలు, ఎంఇఓ కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఆదాయ ధ్రువీకరణ, కుల ధ్రువీకరణ పత్రాలతోపాటు ఆధార కార్డు, ఫోటోతో, వయసు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

డివైడర్ల తొలగింపుతో ప్రజాధనం దుర్వినియోగం

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణంలో అవసరం లేకపోయినా ఉన్న డివైడర్లు తొలగించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని టిడిపి ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్ర వర్మ ఆరోపించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుదవారం ఏర్పాటు చేసిన విలేఖలు సమావేశంలో ఆయన మాట్లాడారు. రహదారి విస్తరణలో రివైడర్లను తొలగించినప్పటికి మార్పు ఏమి లేదని అన్నారు. ఉన్న వాటిని తొలగించి కొత్త డివైడర్లు నిర్మాణంతో ప్రజా ప్రజాధనం దుర్వినియోగం తప్ప ప్రజలకు ప్రయోజనం లేదన్నారు. పురపాలక సంఘం ఇంజనీరింగ్ విభాగం వైఫల్యం వల్లే పైపులైన్ పగిలిపోయిందని అన్నారు. ప్రధాన రహదారిపై నీటి పైపులు మరమ్మత్తులు చేయ కుండా వాటిపై రోడ్లు వేయడంతో పగిలిపోయిన పైపుల ద్వారా వాటర్ లీక్ అవుతూ ఉందని అన్నారు. ఉదయం 6 గంటల సమయంలో రోడ్లపై నీరు ప్రవహిస్తుందని అన్నారు. కళ్ళముందు కనిపిస్తున్న లీకులను నివారించాల్సిన పురపాలక సంఘం అధికారులు, పాలకులపై లేదాని ప్రశ్నించారు. శ్రీనివాస నగర్ కాలనీ వద్ద గత 40ఏళ్ల నుంచి డివైడర్లు మధ్య రోడ్డ క్రాసింగ్ ఉంది. ఇప్పుడు కొత్తగా నిర్మిస్తున్న డివైడర్లతో దారి లేకుండా చేశారని అన్నారు. శ్రీనివాస నగర్ కాలనీలోకి వెళ్లేందుకు డివైడర్ల మధ్య దారి లేకుండా చేయడం రాజకీయ కుట్రే నన్నారు. పాత డివైడర్లు తొలగింపుతో వచ్చిన ఇతర రద్దును వైసిపి పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్ బాబు జగనన్న కాలనీ వద్ద ఆయన స్థలంలో పూడిక నింపుకునేందుకు వాడుకున్నారని అన్నారు. అదే మట్టిని జగనన్న కాలనీలో పల్లపు ప్రాంతానికి తరలించొచ్చు కదాని అన్నారు. ఎంఎల్ఏ కోన రఘుపతి అవినీతి తారా స్థాయికి చేరిందని అన్నారు. కోన అవినీతి అక్రమాలను ప్రజలు ప్రశ్నించలేని స్థితిలో లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఓటు ద్వారా రఘుపతిని ఘోరంగా ఓడిస్తారని అన్నారు. సమావేశంలో దయా బాబు, తోట నారాయణ, గొలపల శ్రీనివాసరావు, గొల్లపాలెం వెంకటేశ్వర్లు, షాకా పాల్గొన్నారు.



సమావేశంలో టిడిపి అభ్యర్థి నరేంద్రవర్మ

ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

రానున్న సాధారణ ఎన్నికలకు అవసరమైన ఈవీఎంలను స్థానిక విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో భద్రపర్చనున్నారు. దీనికి గాను పాఠశాల్లో సుమారు 12 తరగతి గదులను అధికారులు స్వాధీనం చేసుకుని ఈవీఎం మిషన్లను ఏర్పాటు చేయనున్నారు. నియోజకవర్గ స్థాయిలో భట్టిప్రోలులోనే వీటిని భద్రపరిచి ఇక్కడ నుండే అన్నీ మండలాల్లోని పోలింగ్ కేంద్రాలకు తరలించనున్నారు. అన్ని ఏర్పాట్లను తహశీల్దారు పద్మావతి చేశారు. ఇవిఎంలు బద్రపరుస్తున్న గదులను జడ్పీ సీఈఓ, ఎన్నికల అధికారి ఎన్ఎస్‌విబి వసంతరాయుడు బుధవారం పరిశీలించారు. స్ట్రాంగ్ రూంలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కిటికీలు, వెంటిలేటర్లు మూసివేశారు. దానిలో అవసరమైన విద్యుత్ సౌకర్యం సిద్ధం చేశారు. పాఠశాల కావడంతో స్ట్రాంగ్ రూంకు అనుగుణంగా గదులకు తలుపులను అధికారులే సిద్ధం చేసుకున్నారు. త్వరలో ఈవీఎం మిషన్లు రానున్నాయని తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలని అన్నారు. అశ్రద్ధ చేయవద్దని, తోడ్పాటు అందించాలని పాఠశాల కరస్పాండెంట్ ఎంపీ వెంకట్రావును కోరారు. ఈ 12 గదుల్లో 4గదులు ఏవీఎంలు ఏర్పాటు చేయడానికి, 2 గదులు సెక్యూరిటీ సిబ్బందికి, మరో 2గదులు ఇతర అవసరాలకు పోను మిగిలిన వాటిని అవసరాన్ని బట్టి వినియోగించుకునే విధంగా సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లికార్జునరావు, సర్వేయర్ శ్రీనివాసరావు ఉన్నారు.



స్ట్రాంగ్ రూం పరిశీలిస్తున్న అర్ఓ వసంతరాయుడు

ఇంకొల్లు రూరల్ : మండలంలోని గంగవరం, ఇంకొల్లు, గొల్లపాలెం గ్రామాల్లో ఇవిఎం, వివి ప్యాట్స్‌లపై అధికారులు ఓటర్లకు బుధవారం అవగాహన కల్పించారు. ఓటు వేసే విధానం గురించి క్షుణ్ణంగా వివరించారు. ఏదైనా అనుమానమొస్తే పిర్యాదు చేయాలని అన్నారు. ప్రతి ఒక్కరూ రాబోయే ఎన్నికల్లో ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విఆర్‌ఓలు రేణుక, సురేష్, కృష్ణప్రసాద్, ఎఎస్ఓ పుష్పలత, బిఎల్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.



టిడిపి మేనిఫెస్టో ప్రచారం చేస్తున్న గుడిపాటి శ్రీనివాసరావు

సూపర్‌సిక్స్‌తో భవిష్యత్‌కు గ్యారెంటీ

ప్రజాశక్తి - రేపల్లె

టిడిపి, జనసేన సంయుక్తంగా రూపొందించిన సూపర్ సిక్స్ పథకాలతో భావితరాలకు భవిష్యత్తు లభిస్తుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు అన్నారు. బాబుష్యూరిటి, భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని పట్టణంలోని 14, 15వార్డుల్లో బుధవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టిడిపి మినీ మేఫెస్టోలో ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల పేరుతో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో విధ్వాంసం సృష్టించారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి గెలుపును ఎవ్వరు అపలేరని అన్నారు. జగన్మోహన్‌రెడ్డి అరాచక పాలనకు ప్రజలు చమగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమి విజయం సాధిస్తుందని అన్నారు. అందుకు ప్రజలు మద్దతు ఉందన్నరు. బటన్ నొక్కి ప్రజలపై పన్నులు వేస్తూన్న సిఎం వైఎస్ జగన్‌ను గద్దే దింపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు జిపి రామారావు, జీవి నాగేశ్వరరావు, వెనిగళ్ల సుబ్రహ్మణ్యం, గొట్టిపాటి మహేష్, కేసన నరసింహారావు పాల్గొన్నారు.

ఇంకొల్లులో నేత్రదానం

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఇంకొల్లు గ్రామానికి చెందిన చలిశం కోటేశ్వరరావు (84) మృతి చెందగా కుటుంబ సభ్యులు నేత్రదానం చేశారు. రోటరీ ఆధ్వర్యంలో 537వ నేత్రదానం జరిగిందని రోటరీ ప్రతినిధులు జెట్టి వెంకటేశ్వర్లు, సోమేపల్లి రామ్మోహన్‌రావు అభినందించారు. నేత్రదానం చేసినందుకు దాత భార్య కస్తూరి, కుమారుడు సత్యనారాయణస్వామి, సుధారాణిలను కరి కమలేశ్వరరావు, చుండి సాంబయ్య అభినందించారు.



చలిశం కోటేశ్వరరావు



సభలో మాట్లాడుతున్న యడం బాలాజి

సేవలు అభినందనీయం

ప్రజాశక్తి -యద్దనపూడి

స్థానిక డిఆర్డిఎ కార్యాలయం నందు వాలంటీర్లకు అవార్డుల ప్రధానం బుధవారం చేశారు. సభలో వైసిపి ఇంచార్జి యడం బాలాజీ మాట్లాడుతూ వాలంటీర్లు తమ పరిధిలోని ప్రజలకు విలువైన సేవలు అందిస్తున్నారని చెప్పారు. వావృద్దులు, వికలాంగులకు మంచి సేవ చేస్తున్నారని అన్నారు. మండలానికి సేవా మిత్ర 130, సేవ రత్న 5వచ్చాయి. వాలంటీరల్ల వ్యవస్థతో ప్రభుత్వాన్ని ప్రజలకు చేరువ చేశారని అన్నారు. కరోనా సమయంలో వాలంటీర్ల వ్యవస్థ అనేక మంది పేదలను ఆదుకుందని తెలిపారు. మరోసారి జగన్‌ను సిఎం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఓ శివ సుబ్రహ్మణ్యం, తహశీల్దారు నాగరాజు, ఇఓఆర్డి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు వెంకటప్పయ్య, రేణుక బాలకోటేశ్వరరావు, జెడ్పిటిసి లక్ష్మి నారాయణమ్మ, ఎంపిటిసిలు సిచ్ కృష్ణయ్య,

ఒంగోలు పార్లమెంట్ సమన్వయకర్తగా చెవిరెడ్డి

- కందుకూరు సమన్వయకర్తగా బుర్రా - ప్రకటించిన వైసిపి అధిష్టానం



సిఎం జగన్‌తో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఒంగోలు పార్లమెంట్ సమన్వయకర్తగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఆ పార్టీ అధిష్టానం బుధవారం ప్రకటించింది. బుధవారం రాత్రి పార్టీ ప్రకటించిన ఎనిమిదో జాబితాలో చెవిరెడ్డి పేరును ఒంగోలు ఎంపీ స్థానంలో చేర్చింది. కనిగిరి ఎమ్మెల్యేగా ఉన్న బుర్రా మధుసూదన్ యాదవ్‌ను ఉమ్మడి ప్రకాశం జిల్లా, ప్రస్తుత నెల్లూరు జిల్లాలోని కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించింది.

కనిగిరి ప్రాంత అభివృద్ధిలో

సూరా పాపిరెడ్డి పాత్ర కీలకం

నివాళులర్పించిన సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు



సూరా పాపిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి ప్రాంత అభివృద్ధిలో సూరా పాపిరెడ్డి పాత్ర కీలకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. కనిగిరి పట్టణంలోని సుందరయ్య భవనంలో బుధవారం సాయంత్రం సిపిఎం సీనియర్ నాయకులు, కనిగిరి మాజీ ఎమ్మెల్యే సుర పాపిరెడ్డి 17వ వర్ధంతి సభ పీసీ కేశవరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పాపిరెడ్డి చిత్రపటానికి సిపిఎం నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు వేసి.. ఘనంగా నివాళులర్పించారు. సభను ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి.కొండారెడ్డి, యుటఎఫ్ రాష్ట్ర నాయకులు మీగడ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ రైతాంగ ఉద్యమం, కార్మిక ఉద్యమాల్లో పాపిరెడ్డి కీలక పాత్ర వహించారన్నారు. నిస్వార్థ రాజకీయ నాయకునిగా ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. పాపిరెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పిల్లి తిప్పారెడ్డి, సిపిఐ ఎంఎల్ నాయకులు పాలూరి రమణారెడ్డి, జెవివి నాయకులు వి మాలకొండారెడ్డి, మూలే బ్రహ్మారెడ్డి, జి శ్రీనివాసులు, యుటిఎఫ్ నాయకులు కే కష్ణమూర్తి, కోటిరెడ్డి, ఎస్ తిరుపతమ్మ, సిఐటియు నాయకులు ఎస్కె బషీర, ప్రసన్న, నరేంద్ర, ఖాదర్ వలీ, సిహెచ్ ప్రసాద్, ఏడుకొండలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రైతు సంక్షేమమే ధ్యేయంగా, రైతు బాగుపడితే రాష్ట్రం బాగుపడుతుందనే సదాశయంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని జిల్లా కలెక్టర్ పి రంజిత్‌బాషా పేర్కొన్నారు. వైయస్ఆర్ రైతు భరోసా-పియం కిసాన్ పేరిట ఏటా అందజేసే ఆర్థికసాయంలో భాగంగా ఐదో ఏట మూడో విడత చెల్లింపు కార్యక్రమంతో పాటు సున్నా వడ్డీ పంట రుణాలు పథకంలో భాగంగా బుధవారం ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం నుండి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో జమ చేశారు. బాపట్ల కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ పి రంజిత్‌బాషా, శాసనమండలి సభ్యులు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ వై యస్ ఆర్ రైతు భరోసా-పియం కిసాన్ పథకం కింద జిల్లాలోని 1,92,037 రైతులకు 38.65 కోట్ల రూపాయలు జమ చేస్తున్నామని, సొంత భూమి సాగు చేసుకుంటున్న రైతులతో పాటు పేద కౌలు రైతుల కష్టాలను గమనించి వారికి కూడా అమలు చేస్తున్నామన్నారు. అదేవిధంగా రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోకుండా వారికి అండగా నిలుస్తూ, వై యస్ ఆర్ సున్నా వడ్డీ పంట రుణాలు పథకం కింద 36400 రైతు కుటుంబాలకు రూ 7.2 కోట్లు జమ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి వై రామకష్ణ, హార్టీకల్చర్ ఎ డి జెన్నమ్మ ,వివిధ ప్రాంతాల రైతులు పాల్గొన్నారు.

పోతురాజు కాలువలో వ్యర్థాలను తొలగించాలి

మేయర్ గంగాడ సుజాత



పోతురాజు కాలువను పరిశీలిస్తున్న మేయర్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

పోతురాజు కాలువలో పేరుకు పోయిన వ్యర్థాలను వెంటనే తొలగించాలని నగర మేయర్ గంగాడ సుజాత అధికారులను ఆదేశించారు. సత్యనారాయణపురం ప్రాంతంలో పోతురాజు కాలువలో పేరుకు పోయిన వ్యర్థాలను బుధవారం ఆమె పరిశీలించారు. కాల్వలో ఉన్న చెత్తా, చెదారాన్ని వెంటనే తొలగించాలని, మురుగు నీరు సాఫీగా పారేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మేయర్ వెంట డిఈఈ గణపతి, శానిటరి ఇన్స్‌పెక్టర్ షేక్ బాబ్జీ, మిరియం శ్రీను, కార్పొరేటర్ అంగిరేకుల గురవయ్య ఉన్నారు.

ఎన్నికల నేపథ్యంలో

నిబంధనల మేరకే బాధ్యతలు నిర్వర్తించాలి

కలెక్టర్ రంజిత్‌బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం నియమ నిబంధనల మేరకు యంసియంసి కమిటీ తగు భాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి పి రంజిత్‌బాషా పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ యంసియంసి కమిటీ (మీడియా సర్టిఫికేషన్ మరియు మానిటరింగ్ కమిటీ) సభ్యులతో సమావేశమై సార్వత్రిక ఎన్నికలలో కమిటీ పాటించాల్సిన విధి విధానాల గురించి చర్చించారు. వివిధ రాజకీయపక్షాలకు సంబంధించిన ప్రకటనలు, పెయిడ్ న్యూస్ తదితర విషయాల్లో సభ్యులందరు పరిశీలించి తగు నిర్ణయాలు తీసుకోవలసి ఉందన్నారు. కమిటీ కు అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులైన జిల్లా రెవిన్యూ అధికారి సత్తిబాబు, జిల్లా వ్యవసాయ శాఖధికారి రామకష్ణ, కేంద్ర ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి రమేష్ చంద్ర, హిందూ దినపత్రిక సీనియర్ కరస్పాండెంట్ సాంబశివరావు, సమాచార శాఖ సహాయ సంచాలకులు సుభాషిణి పాల్గొన్నారు.

రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తిచేయాలి

జిల్లాలో పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయుటకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి రంజిత్ భాషా తెలిపారు. బుధవారం వివిధ రాజకీయ పక్షాలతో వారాంతపు సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లోని పోలింగ్ స్టేషన్ల పేర్లు తప్పుగా నమోదైన వాటిని సరిచేసామని, అదేవిధంగా వివిధ కారణాలతో పోలింగ్ స్టేషన్ల ప్రాంతాలను మార్పు చేసామని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అసంపూర్తి నిర్మాణాలు, శిదిలావస్థకు చేరిన బిల్డింగుల్లో పోలింగ్ స్టేషన్ల ను మార్పు చేసినట్టుగా రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసామన్నారు. అదేవిధంగా పెండింగ్ లో ఉన్న వివిధ క్లయిములను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. ఎన్నికల ప్రకటన త్వరలోనే జారీ అయ్యే అవకాశం ఉన్నందున, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, మీడియా సర్టిఫికేషన్ మరియు మానిటరింగ్ కమిటీ తదితర విషయాలపై రాజకీయ పార్టీ ప్రతినిధులకు అవగాహన కల్పిస్తామన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్స్, కౌంటింగ్ కేంద్రాలను రాజకీయ పక్షాలు పరిశీలన చేసుకోవచ్చునన్నారు. ఈ సమావేశంలో డిఆర్వో సత్తిబాబు, ఆర్ డి ఓ హెలా షారోన్, వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నుండి మాల్యాద్రి , టిడిపి నుండి షేక్ మహమ్మద్ గౌస్ భాషా , బిజెపి నుండి రామకష్ణ ,బి ఎస్ పి నుండి కోటేశ్వరరావు, ఆమ్ ఆద్మీ పార్టీ నుండి బాలాజీ రెడ్డి, సిపిఎమ్ నుంచి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వినోద్

నేడు కొత్తపట్నంలో

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటి సమావేశం గురువారం కొత్తపట్నంలో నిర్వహిస్తున్నట్లు ఆసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె విజయ్, సిహెచ్ వినోద్ తెలిపారు. స్థానిక ఎల్‌బిజి భవన్‌లో బుధవారం వారు విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో రూ.1650 కోట్లు రియంబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉందని తెలిపారు. విద్యాదీవెన, వసతి దీవెన ఫీజులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఆరు మాసాలుగా హాస్టల్స్‌కు ఇవ్వాల్సిన మెస్, కాస్మోటిక్ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పరీక్షలు వచ్చేనాటికి కూడా ప్రభుత్వ ఇంటర్ కాలేజీల్లో పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదని, లెక్చరర్ పోస్టులు భర్తీ చేయలేదని విమర్శించారు. మరోవైపు కార్పొరేట్ విద్యాసంస్థలకు విచ్చలవిడిగా స్వేచ్ఛనిచ్చి వాటికి అడ్డుగా ఉన్న ప్రభుత్వ విద్యాసంస్థలపై సమస్యలను మోపుతోందన్నారు. ఈ నేపథ్యంలో విద్యారంగ సమస్యలను చర్చించి, తక్షణ కర్తవ్యాలు కోసం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటి సమావేశం కొత్తపట్నంలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సమావేశానికి సంఘం అఖిలభారత మాజీ అధ్యక్షులు వై వెంకటేశ్వర్లు, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె ప్రసన్న కుమార్, ఎ అశోక్, రాష్ట్ర కమిటి సభ్యులు హాజరుకానున్నారని తెలిపారు.

పార్కు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

స్థానిక రాజీవ్ గృహకల్ప ఐదోలైన్‌లో పార్కు నిర్మాణానికి నగర మేయర్ గంగాడ సుజాత బుధవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్కు నిర్మాణం కోసం కార్పొరేషన్ జనరల్ ఫండ్ నుంచి రూ. 15లక్షలు కేటాయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తొమ్మిదో డివిజన్ కార్పొరేటర్ వెన్నపూస కుమారి, వైసిపి నాయకులు వెంకటరెడ్డి, సువర్ణ, పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.



జెవివి జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రభుత్వ రంగంలో

సైన్స్ పరిశోధనలకు ప్రోత్సాహం అందివ్వాలి

జెవివి డిమాండ్

ప్రజాశక్తి..ఒంగోలు సబర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాస్త్ర..సాంకేతిక రంగాల్లో పరిశోధనలకు, ప్రయోగాలకు తగినన్ని నిధులు కేటాయించి,అవసరమైన ప్రోత్సాహం అందించాలని జనవిజ్ఞానవేదిక జిల్లా గౌరవ సలహాదారులు ఎవి పుల్లారావు అన్నారు. బుధవారం జనవిజ్ఞానవేదిక ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెవివి జిల్లా కార్యాలయం ఎల్‌బిజి భవన్ వద్ద సంఘ జెండాను ఎగుర వేశారు. ఈసందర్భంగా అక్కడ నిర్వహించిన కార్యక్రమానికి జెవివి నగర అధ్యక్షులు ఎస్వీ రంగారెడ్డి అధ్యక్షత వహించారు. ఎవి పుల్లారావు మాట్లాడుతూ ఆకాశంలోకి రాకెట్లు పంపడంతోపాటు అడవిలో ఉన్న వారికి కూడా అభివృద్ధి, విజ్ఞానం అందాల్సిన అవసరం ఉందన్నారు. జెవివి జిల్లా కోశాధికారి బి తిరుపతయ్య మాట్లాడుతూ నోబెల్ బహుమతి గ్రహీత సి.వి. రామన్‌చే 'రామన్ ఎఫెక్ట్' కనిపెట్టిన రోజైన ఫిబ్రవరి 28ని జాతీయ సైన్స్ దినోత్సవంగా 1987 నుంచి జరుపుకుంటున్నామని, అయితే దేశంలో ఈ మధ్య కాలంలో రీసెర్చ్ అండ్ డవలప్‌మెంట్ బాగా తగ్గిపోయిందని, కేంద్ర ప్రభుత్వం ఐఐటి, ఎన్ఐటి లాంటి ప్రతిష్టాత్మక టెక్నాలజి సంస్థలకు అధ్యాపక సిబ్బందిని నియమించడం లేదని తెలిపారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ జయప్రకాష్ మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపరచబడిన 51 (ఏ..హెచ్) ప్రకారం పౌరులందరికి శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధిలో కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జెవివి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నల్లూరి వెంకటేశ్వరరావు, ఎన్‌టి వెంకటేష్, నాయకులు డిచంద్రశేఖర్, ఎన్ నాగేశ్వరరావు, సిహెచ్ లక్ష్మీ నారాయణ, టివిఆర్ సుబ్బారావు, జి హరిబాబు, జ్యోత్స్న, పద్మశ్రీ, జి ఉమామహేశ్వరి, రత్నాకర్, వి తిరునారాయణ, పివి నారాయణ పాల్గొన్నారు.

ట్రయల్ రన్ బందోబస్తుపై సమీక్ష

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

అత్యవసర పరిస్థితులలో విమానాలు కిందకు దిగడానికి 16 నెంబర్ జాతీయ రహదారి పై నిర్మించిన ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ ప్రాంతంలో జరగబోయే ట్రైల్ రన్ బందోబస్తు గురించి ఎస్పీ వకుల్ జిందాల్ బుధవారం సమీక్షించారు.బాపట్ల జిల్లా లోని 16 జాతీయ రహదారి పై కొరిశపాడు మండలం పిచ్చికలగుడిపాడు వద్ద 4.1 కి.మి ల మేర నిర్మించిన ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీలో భారత వైమానిక దళం విమానాల ల్యాండింగ్ ట్రైల్ రన్‌ను త్వరలోనే నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, సంయుక్త కలెక్టర్ చామకూరి శ్రీధర్ వైమానిక దళ అధికారులతో ఆ ప్రాంతాన్ని సందర్శించి తీసుకోవలసిన భద్రత ఏర్పాట్ల గురించి సమీక్షించారు.